
వార్త
ఆదివారం
16 జూన్, 2024
అరచేతిలో
'సోషల్' విషం..

# 'కన్నప్ప'లో శ్రియారెడ్డి!



టాలీవుడ్ హీరో మంచు విష్ణు కథానాయకుడుగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమా కోసం విష్ణు ఎంతో శ్రమిస్తున్నాడు. ఇందులో నటి శ్రియారెడ్డి ఓ కీలక పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. నెగెటివ్ షేడ్స్ కలిగిన పాత్రల్లో నటించి ఆమె మంచి పేరు తెచ్చుకుంది. 'కన్నప్ప'లో ఎలాంటి పాత్ర నటించనుందో చూడాలి మరి. ఈ చిత్రంలో ప్రభాస్, అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్ పవర్‌ఫుల్ పాత్రల్లో నటిస్తున్నారు. ప్రీతి ముకుందన్ ఈ సినిమాలో కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. **24** ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, ఏవిఏ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## తారాతీరం

# ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం?



ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమా త్వరలో షూటింగ్ ప్రారంభం కానుంది. ఇందులో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రం ప్రేక్షకులకు కనుల విందుగా ఉంటుందని తెలుస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీ కథానాయికగా నటించనున్నట్లు సమాచారం.

ఇందులో మరో హీరోయిన్‌కి కూడా స్కోప్ ఉందనీ, ఆ పాత్రలో మరో స్టార్ హీరోయిన్‌ను తీసుకునే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు తాజా సమాచారం.

ఆదివారం వార్త

16 జూన్, 2024

## మంచి ముత్యాలు

ఏకాంతంలో ప్రతిభ అభివృద్ధి చెందినట్లే, ప్రపంచపు రణగొణ ధ్వనుల మధ్య వ్యక్తిత్వం ఎదుగుతుంది.

- గోథే

# విషయ విశేషం

రంగుల మిర్చి... 4

'సంఘీ'భావం....5

భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ర్యాగింగ్

కవర్ స్టోరీ..6

అరచేతిలో 'సోషల్' విషం..

డ్రోన్ల తయారీలో దిట్ట...11

ఈవారం కవిత్వం..12

స్వేదం చిందించిన శ్రామికుడు

నాన్నే నా హీరో..14

మేనరికపు పెళ్లి....18

కథ.. 20

నాడు-నేడు

సాహిత్యం..23

'తమిళ' రచనల సేవలో..

త్యాగాల ప్రతీక బక్రీద్....26

ఇంట్లో వాస్తు లోపాలున్నాయా?..29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం


వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## పశువు తేన్పుతో వజ్రాలు



వజ్రాలు సహజంగా దొరుకుతాయి. కొందరేమో శిలాజ ఇందనాల నుంచి మీథేన్‌ను సేకరించి ల్యాబ్‌లో తయారు చేస్తుంటారు. పశువుల తేన్పు, అపాన వాయువుతో వజ్రాలను సృష్టించడం ఎక్కడైనా విన్నారా. అది తెలుసుకోవాలంటే ఐప్యాడ్ సృష్టికర్త, ఐఫోన్ సహ సృష్టికర్త అయిన టోనీ ఫాడెల్ లేబోరేటరీకి వెళ్లాల్సిందే. ఒక్కో పశువు ఏడాదికి దాదాపు 150 నుంచి 200 కిలోల మీథేన్ వాయువును విడుదల చేస్తుంది. అది భూతాపానికి కారణమై పర్యావరణానికి ఎంతో హాని కలిగిస్తుంది. అలాగని పశువులు తేన్చకుండా, అపాన వాయువును విడుదల చేయకుండా చూడ్డం సాధ్యమయే పనికాదు. అందుకే బయోమీథేన్‌పైన పరిశోధనలు చేసి ఆ గ్యాస్‌ను వజ్రాలుగా మార్చొచ్చని చెబుతున్నాడు టోనీ. 'డైమండ్ ఫౌండ్రీ' అనే తన సంస్థ ద్వారా బయో మీథేన్‌తో వజ్రాలను తయారు చేస్తున్న ఆయన ఈ మధ్య స్లొవేకియాలోని వ్యాపారవేత్తల ఫేస్ట్‌లో ఆ విషయాన్ని వెల్లడించాడు. అంతా బాగానే ఉంది కానీ పశువుల నుంచి మీథేన్‌ను ఎలా సేకరిస్తారు అనే సందేహం కలగొచ్చు. పశువుల జీర్ణాశయంలోకి ఓ సన్నటి పైపును పంపుతారు, అలానే మూతికీ ఓ బ్యాగుని అమర్చుతారు. ఆ రెండిటినీ పశువు వీపుమీదున్న ట్యాంకులాంటి సంచిని అనుసంధానించి మీథేన్ గ్యాస్‌ను సేకరిస్తారు. తరువాత ఆ వాయువుతోనే వజ్రాల్ని తయారు చేస్తారన్నమాట.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# రంగుల మిర్చి

**పచ్చిమిర్చి** మొక్కను చూశారా ఎప్పుడైనా ఆకుల రంగులోనే కాసే మిరపకాయలను వెతికి మరీ కోసుకోవాల్సి వస్తుంది కదూ. అదే ఇంద్రధనుస్సు మిర్చి మొక్కను పెంచారనుకోండి..ఏడు వర్ణాల్లో కొమ్మకో రంగు మిరపకాయలను అందిస్తుంది. వర్ణరంజితంగా విరగ్గాసే ఈ రెయిన్‌బో మిర్చి నోటికి రుచిగానూ కంటికి ఇంపుగానూ ఉంటుంది. మరి అలంకరణకీ, ఆహారపదార్థాల తయారీకీ వాడే ఆ ఇంద్రధనుస్సు మిర్చి కథ ఏంటో



తెలుసుకుందామా!

కూరలూ పచ్చళ్లూ రకరకాల టిఫిన్లూ..ఇలా చెబుతూపోతే ప్రతిరోజూ దాదాపుగా అన్ని వంటల్లోనూ పచ్చిమిర్చిని వాడాల్సిందే. పచ్చిమిర్చి లేని వంటింటిని మనం అస్సలు ఊహించుకోలేం. అందుకే చాలామంది ఇంట్లోనే ఓ మిరపమొక్కను పెంచుకుంటారు. పచ్చిమిర్చి ఆకుపచ్చ రంగులో ఉండి ఆకుల్లో కలిసి పోవడం వల్ల దగ్గరకు వెళితేగానీ కాయలు కనిపించవు. పక్వానికి వచ్చి పండాకే కాయలు ఎర్రగా మారతాయి. మనకు తెలిసిందీ, మన దగ్గర పండే మిర్చిరకం ఇదే. విదేశాల నుంచి వలస వచ్చిన ఇంద్రధనుస్సు మిర్చి మొక్క మాత్రం ఏడురంగుల్లో కాస్తుంది. గుబురుగా పెరిగే ఈ మొక్కకు ఊదా, ఎరుపు, నారింజ, ఆకుపచ్చ, తెలుపు, పసుపురంగుల్లో కాయలుంటాయి. పైగా ఈ మిర్చి కాస్త గుండ్రంగానూ పొడవు తక్కువగానూ ఉండి..ఆకాశం వైపు చూస్తుంటుంది. ఈ మొక్కను ఎక్కడ పెట్టినా ముదురు వర్ణంలో కనిపించే కాయలు సూర్యకాంతికీ, లైట్ల వెలుగులకీ మిణుకుమిణుకుమన్నట్లు కనిపిస్తాయి. మరి ఈ మిర్చి కేవలం ఆకర్షణకోసమేనా అంటే కాదనే చెప్పాలి. దీన్ని వంటకాల్లోనూ విరివిగానే ఉపయోగిస్తారు. మనం కూరలకూ, పచ్చళ్లకూ వాడేమిర్చిలో 30000-50000 స్కోవిల్లె యూనిట్ల కారం ఉంటుంది. కానీ, రెయిన్‌బో మిర్చిలో ఉండేకారం పదివేల నుంచి ముప్పైవేల యూనిట్లలోపే. ఘాటూ కాస్త తక్కువగానే ఉండే ఈ మిర్చిని కూరలూ, పచ్చళ్లూ, సలాడ్లూ, సూపులూ, సాసులూ, ఎడిబుల్ కలర్స్, పులిహోర, ఫ్రైడ్‌రైస్ తదితరాల తయారీకి ఉపయోగిస్తారు. మామూలు మిర్చిలానే వీటిలోనూ బజ్జీలు వేసుకోవచ్చు. రంగులతో మేజిక్ చేసే ఈ మిర్చిని అలంకరించడం వల్ల టేబుల్‌పైన ఉంచిన పదార్థాలు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తూ అతిథుల చేత వహ్వా అనిపిస్తాయి. విరగ్గాసిన రంగుల మిర్చితో గుబురుగా ఉన్న ఓ మొక్కని టీపాయ్ మీదో, డైనింగ్‌టేబుల్ మీదో పెట్టారంటే కంటికింపుగా ఉండటంతోపాటు లైట్లు వేస్తే క్రిస్మస్ ట్రీనీ తలపిస్తుంది.

**రంగుల మాయ!**

రెయిన్‌బో మిర్చి పుట్టింది దక్షిణ అమెరికాలోని బొలీవియాలో. దీని రంగుల మాయజాలానికి కారణం అందులో ఉండే పిగ్మెంట్(వర్ణద్రవ్యం), క్లోరోఫిల్(ఆకుపచ్చ), ఆంథోసియానిన్(ఊదా), జాంథోఫిల్(పసుపు), కెరోటినాయిడ్స్ (నారింజ), క్యాప్సాంథిన్ (ఎరుపు)..వంటి రసాయన సమ్మేళనాల కారణంగా ఈ మొక్కకు కాసే మిరపకాయలు వివిధ రంగులను సంతరించుకుంటాయి. కొన్ని రకాల మొక్కలకు ఏడురంగుల్లో చిల్లీస్ కాస్తాయి. జన్యుపరమైన మార్పులకు లోనైన మొక్కలకు కాసే మిర్చి, ఊదా, పసుపు, నారింజ, తెలుపు, ఆకుపచ్చ, ఎరువు..ఇలా వరసబెట్టి రంగులు మారుతుంటుంది. ఏడాదంతా కాసే ఈ మిర్చికి వేడిగా ఉండే వాతావరణం ఎంతో అనుకూలమైంది. చీడపీడలు కూడా అంతగా ఆశించవు. మరి రుచికి ఘాటుగా ఉన్నా..చూడ్డానికి ఆకర్షణీయంగా ఉండే ఈ మొక్క కానుకగానూ ఇచ్చేందుకు బాగుంటుంది. ❑



## 'సంఘీ' భావం



# భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న ర్యాగింగ్

కేవలం వృత్తి కళాశాలలకే పరిమితంగా ఉండే ర్యాగింగ్ ప్రస్తుతం సాధారణ కళాశాలకు కూడా విస్తరించింది. జూనియర్లను సీనియర్లు ఆటపట్టించడాన్ని ర్యాగింగ్ అంటారు. ఇది ఒక పరిధి వరకు ఉంటే ఎలాంటి అభ్యంతరాలు ఉండవు. అయితే ర్యాగింగ్‌ను వికృత చేష్టలకు నిలయంగా మార్చడంతో సమస్యలు ప్రారంభమయ్యాయి. కొత్తగా కళాశాలల్లో చేరిన వారు సీనియర్లతో మర్యాదపూర్వకంగా మసులుకోవడానికి ఒకప్పుడు ర్యాగింగ్‌ను అమలుచేసే వారు. అయితే దీనివల్ల సున్నిత మనస్కులైన విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం, భయపడి విద్యకు స్వస్తి పలకడం వంటి ఘటనలు పెరగడంతో పూర్తిస్థాయిలో ర్యాగింగ్‌ను నిషేధించారు. ఏదైనా కళాశాలలో ర్యాగింగ్ జరుగుతున్నట్లు సమాచారం అందితే పోలీసులు అక్కడికి చేరుకుని కేసులు పెడుతున్నారు. ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల్లో స్థానిక పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి ర్యాగింగ్‌కు సంబంధించిన సమాచారం తమకు ఇవ్వాలని పేర్కొంటున్నారు. అదేవిధంగా వివిధ కళాశాలల్లో సీనియర్ విద్యార్థులతో సమావేశాలు ఏర్పాటుచేసి ర్యాగింగ్ చేస్తే వచ్చే అనర్థాల గురించి వివరిస్తున్నారు. కళాశాలల యాజమాన్యాలు కూడా ర్యాగింగ్ చేయకూడదని ఆంక్షలు విధిస్తున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ర్యాగింగ్ కొనసాగుతూనే ఉంది. ర్యాగింగ్‌పై ఫిర్యాదు చేయడానికి విద్యార్థులు భయపడుతున్నారు. సీనియర్లు కూడా ఈ విషయం బయటకు తెలిస్తే కళాశాలలో అడుగుపెట్టనివ్వమని బెదిరిస్తున్నారు. దీనితో ర్యాగింగ్‌ను మౌనంగా భరించి భయాందోళనలతో రోజులు గడుపుతున్నారు. ఉన్నత కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ర్యాగింగ్ ప్రక్రియను భరించలేక యుజీసీకి ఫిర్యాదులు చేస్తున్నారు. 2022లోనే సుమారు వెయ్యికిపైగా ఫిర్యాదు అందాయి. 2023-24 విద్యాసంవత్సరంలో సుమారు 13 వందల వరకు ఫిర్యాదులు అందాయి. అయితే ఇవి వాస్తవ పరిస్థితులకు చాలా తక్కువగా ఉన్నాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ప్రతి కళాశాలలో ర్యాగింగ్ యధేచ్ఛగా జరుగుతోందని జూనియర్ విద్యార్థులు వాపోతున్నారు. వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాలలో ప్రీతి ర్యాగింగ్‌ను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో సీనియర్స్‌పై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నా కొద్ది రోజులకే ఎత్తివేశారు. దీనివల్ల సీనియర్లలో భయం పోతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటి వరకు ర్యాగింగ్‌కు సంబంధించి కఠినంగా వ్యవహరించిన దాఖలాలు లేవు. గతంలో కేవలం విద్యకు, విజ్ఞానికి సంబంధించి అంశాలపై మాత్రమే ర్యాగింగ్ జరిగేది. క్రమంగా వికృత చేష్టలకు దారితీయడంతో శరీరం తీరు, ఎత్తు, ప్రాంతీయ తత్వం, కుల, మతాలు వంటి ప్రభావం పెరిగిపోయింది. ఈ ర్యాగింగ్ ఒకటి రెండు రోజులకు పరిమితం కాకుండా పదేపదే చేస్తూ ఉండటంతో జూనియర్లలో భయం పెరిగి చదువుపై ఏకాగ్రత కోల్పోతున్నారు. ఇటీవల కాలంలో డ్రగ్స్, గంజాయి కళాశాలల ప్రాంగణంలోకి ప్రవేశించడంతో కొందరు విద్యార్థులు వాటికి బానిసలుగా మారుతున్నారు. దీనితో వారు కొన్ని సందర్భాల్లో వ్యవహరిస్తున్న తీరు జూనియర్లకు మానసిక ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా హాస్టళ్లలో ఉంటున్న వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. అర్థరాత్రి సమయా ల్లో సీనియర్లు గదుల్లోకి చొరబడి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. కళాశాల తరగతి సమయం దాటిన తరువాత హాస్టల్ గదులకు వెళ్లాలంటేనే జూనియర్ విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇతర కళాశాలలతో పోలిస్తే ఎక్కువగా మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలల్లోనే ర్యాగింగ్ ప్రభావం అధికంగా కనిపిస్తోంది. ముఖ్యం గా ప్రైవేటు కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. కళాశాలల్లో ర్యాగింగ్ నిర్మూలన కమిటీలు ఏర్పాటుచేసినా అవి అంతంతమాత్రంగానే పనిచేస్తున్నాయి. ఈ కమిటీల్లో అధ్యాపకులతో పాటు విశ్వవిద్యాలయాలకు చెందిన కొందరు సీనియర్ ఉద్యోగులను కూడా భాగస్వామ్యం కల్పిస్తే యాజమాన్యాలు కూడా ర్యాగింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటారు. అంతేకాకుండా ఈ కమిటీలు కేవలం రాత్రివేళల్లో హాస్టళ్లను ఒకసారి సందర్శిస్తే అక్కడ జరిగే దారుణాలు వెలుగుచూస్తాయి. కేవలం కళాశాలల పని వేళల్లో మాత్రమే ఈ కమిటీలు పనిచేస్తున్నాయి. అదేవిధంగా ఆయా కళాశాలల పరిధిలోని పోలీసుస్టేషన్లకు సంబంధించిన పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయడం ద్వారా ర్యాగింగ్‌ను అరికట్టడానికి అవకాశం ఉంటుంది. ర్యాగింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థులపై కఠినంగా చర్యలు తీసుకుంటే పరిస్థితి కొంతవరకు అదుపుచేయవచ్చు. ర్యాగింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను కళాశాలకు పిలిపించి కౌన్సెలింగ్ చేస్తే ఆశించిన ఫలితాలు లభిస్తాయి. ర్యాగింగ్ చేస్తున్న విద్యార్థులపై చర్య తీసుకున్న విషయాన్ని కళాశాలతో పాటు ఇతర విద్యాసంస్థలకు కూడా సమాచారం ఇవ్వడం ద్వారా మరొకరు ర్యాగింగ్‌కు పాల్పడకుండా నిరోధించే అవకాశం ఉంటుంది. కళాశాలలు ప్రారంభమైన నెల రోజుల వరకు తప్పనిసరిగా గస్తీ ఏర్పాటుచేయాలి. సిసి కెమెరాలు ఏర్పాటుచేసి విద్యార్థుల కదలికలను గుర్తించాలి. సిసి కెమెరాల ఆధారంగా చర్యలు తీసుకుంటే జూనియర్లు ప్రత్యేకంగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం ఉండదు. కళాశాల ప్రాంగణంతో పాటు హాస్టల్ గదుల్లో కూడా సిసి కెమెరాలను ఏర్పాటుచేయడం ద్వారా ర్యాగింగ్‌ను సమర్థవంతంగా అరికట్టే అవకాశం లభిస్తుంది. ర్యాగింగ్‌ను సామాజిక రుగ్మతగా గుర్తించి అందుకు అనుగుణంగా చట్టాలలో మార్పులు చేర్పులు చేయాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ




# అరచేతిలో 'సోషల్' విషం..

**కవర్‌స్టోరీ**

**డి.జె.మోహన రావు**

**ఉత్తరప్రదేశ్ 10వ తరగతి రాష్ట్ర టాపర్ అయిన ప్రాచీ నిగమ్ తన చివరి పరీక్షలలో 98.5 శాతం సాధించి తన తల్లిదండ్రులను గర్వపడేలా చేసింది. కానీ కొంతమంది పాశవిక బుద్ధితో ఆమె ముఖం మీద రోమాలు గురించి సోషల్ మీడియాలలో అసహ్యకరమైన వ్యాఖ్యలు(ట్రోలింగ్) చేశారు. అప్పుడు ఆమె "నా కుటుంబం, నా ఉపాధ్యాయులు, నా స్నేహితులు నా రూపాన్ని ఎన్నడూ విమర్శించలేదు, దాని గురించి ఎప్పుడూ బాధపడలేదు. ఫలితాల తర్వాత నా ఫొటో ప్రచురించబడినప్పుడు మాత్రమే ప్రజలు నన్ను ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఆపై నా దృష్టి సమస్యపైకి మళ్లింది. ఇంజినీర్ కావడమే నా లక్ష్యం, అంతిమంగా ముఖ్యమైనది నా మార్కులే తప్ప నా ముఖం మీద రోమాలు కాదు" అని ధైర్యంగా చెప్పింది.**

సోషల్ మీడియా బాధితుల్లో ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. దేశ వ్యాప్తంగా ప్రతీరోజు వీటి బారిన పడుతూనే ఉన్నారు. ప్రతిరోజూ చాలామంది సోషల్ మీడియాలో ఈ విధమైన 'ట్రోలింగ్'కి గురవుతూనే ఉన్నారు. కొంతమంది లోలోపల బాధపడతారు. మరికొందరు సున్నిత మనస్కులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు లేకపోలేదు. సోషల్ మీడియా వలన ఎంత ఉపయోగం ఉందో అన్ని నష్టాలు కూడా ఉన్నాయి. ఏదైనా మనం ఉపయోగించిన తీరు మీదే ఆధారపడి ఉంటుంది.


## సోషల్ మీడియా అంటే?

సోషల్ మీడియా అనే పదం అందరికీ సుపరిచితమే. వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఇంటర్నెట్ సహాయంతో వ్యక్తులు ఒకరితో ఒకరు వారి భావాలను, ఆలోచనలను, సమాచారాన్ని, సందేశాలు, ఇమేజ్‌లు, వీడియోల రూపంలో షేర్ చేసుకునే ఆన్‌లైన్ మాధ్యమాన్ని సోషల్ మీడియా అంటారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్(ట్విట్టర్), మోజ్, షేర్‌చాట్, స్నాప్ చాట్, లింక్డిన్, వాట్సప్, యూట్యూబ్ మొదలైనవి సోషల్ మీడియాకు చెందిన ప్లాట్ఫామ్స్. సోషల్ మీడియా అనేది సమాచారాన్ని భాగస్వామ్యం చేయడానికి లేదా ప్రసారం చేయడానికి ఉపయోగించే ప్లాట్‌ఫారమ్. మరోవైపు సోషల్ నెట్‌వర్క్ అనేది కనెక్ట్ చేయడానికి ఉపయోగించే కమ్యూనికేషన్ ప్లాట్‌ఫారమ్. ఒకే ప్లాట్‌ఫారమ్ సోషల్ మీడియా, సోషల్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫారమ్‌గా పని చేస్తుంది.

## సోషల్ మీడియా అందుబాటు

తక్కువ ధరకే స్మార్ట్‌ఫోన్ లభ్యత, సరసమైన ఇంటర్నెట్ సదుపాయంతో సామాజిక మాధ్యమాల వినియోగం పట్టణ ప్రాంతాలతో సమానంగానే గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉంది. ప్రపంచం నలుమూలలలో నివసిస్తున్న కుటుంబాలు, స్నేహితులు, బంధువులను తక్షణమే అనుసంధానం చేయడంలో సోషల్ మీడియా పాత్ర ఎనలేనిది. ఇది సమాజంలో చాలా కీలక పాత్ర పోషిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 2024 నాటికి 507 కోట్లమంది సోషల్ మీడియా వినియోగదారులు ఉన్నారని, ఈ సంఖ్య ప్రపంచ మొత్తం జనాభాలో 62.6 శాతానికి సమానమని కెపియోస్ బృందం అధ్యయనాలు తెలిపాయి. గత పన్నెండు నెలల సోషల్ మీడియా వినియోగదారుల సంఖ్య పెరుగుతూనే ఉందని, గత యేడాది కొత్తగా 25.9 కోట్ల మంది చేరారని తెలిపింది. ఇది ప్రతి సెకనుకు సగటున 8.2 కొత్త వినియోగదారుల చొప్పున 5.4 శాతం వార్షిక వృద్ధికి సమానం.

సోషల్ మీడియాలో రోజుకు సగటున 2.5 గంటలు గడుపుతున్నారు. డేటా ఎ.ఐ. ప్రకారం ఏప్రిల్ 2024 నాటికి సోషల్ మీడియాలో యూట్యూబ్, వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మెసెంజర్లు మొదటి ఐదు స్థానాలలో ఉన్నాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు చాలామంది ప్రజల రోజువారీ జీవితంలో అంతర్భాగంగా మారాయి.



## మన దేశంలో పరిస్థితి

ఇటీవలి గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద ఇంటర్నెట్ వినియోగదారులను కలిగి వున్న దేశంగా భారతదేశం రికార్డులకెక్కింది. మన దేశంలో మొత్తం మొబైల్ కనెక్షన్ల సంఖ్య 114 కోట్లు. 62.4 కోట్లకు పైగా ప్రజలు ఇంటర్నెట్‌ను కలిగి ఉన్నారు. వీరిలో దాదాపు 40 కోట్ల మంది సోషల్ మీడియాని ఉపయోగిస్తున్నారు. సోషల్ మీడియా వినియోగదారుల వార్షిక వృద్ధి రేటు 4.2 శాతం ఉంది. సగటున ప్రతిఒక్కరూ సోషల్ మీడియాలో రోజుకు 156 నిమిషాలు గడుపుతున్నారు.

## సోషల్ మీడియా అనుకూలతలు

సోషల్ మీడియా మన వ్యక్తిగత, సామాజిక, వృత్తిపరమైన అంశాలన్నింటినీ ప్రభావితం చేస్తుంది. సోషల్ మీడియా అనేది ఒక వ్యక్తి మనస్సు, ప్రవర్తనను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుంది. తద్వారా సమాజం ఏ దిశలో ముందుకు వెళ్లాలో నిర్ణయించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. చాలా సులభంగా అధిక ప్రజలకు చేరుకోవడానికి, ఏదైనా సమాచారాన్ని చాలా తక్కువ సమయంలో చాలా ప్రభావవంతంగా తెలియజేయడానికి తోడ్పడుతుంది. సమకాలీన సమస్యలపై అవగాహన పెంచడానికి, వివిధ ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ కావడానికి ప్రభుత్వానికి ఇది సహాయకారిగా ఉంటుంది. ప్రపంచంలో అనేక అణచివేత పాలన దేశాలలో ప్రజాస్వామ్య అనుకూల పోరాటాలలో కూడా ఇది కీలక పాత్ర పోషించింది.



## విద్యా ప్రయోజనాలు

కొవిడ్-19 మహమ్మారి సమయంలో బ్లాగ్‌లు, పాడ్‌క్యాస్ట్‌లు, ఇ-లెర్నింగ్, ఎమ్-లెర్నింగ్, యూట్యూబ్ ద్వారా ఆన్‌లైన్ తరగతులను నిర్వహించి లక్షలాది మంది విద్యార్థులకు విద్యను అందించడంలో సోషల్ మీడియా గురుతర పాత్ర పోషించింది. సోషల్ మీడియా విద్యా పాత్ర కేవలం అకడమిక్ ఎడ్యుకేషన్‌కు మాత్రమే పరిమితం కాకుండా చాలా విస్తృతమైనది. కరెంట్ అఫైర్స్, రాజకీయాలు, పర్యావరణం మొదలైన వాటితో సహా వివిధ అంశాలకు సంబంధించి అవగాహనను పెంపొందించడం వంటి కోణాలను కూడా కలిగి ఉంది.

## సామాజిక ప్రయోజనాలు

సోషల్ మీడియాకు మానవ ప్రవర్తనలో ఆత్మవిశ్వాసం, ప్రేరణను కలిగించే సామర్థ్యం ఉంది. వ్యక్తుల సృజనాత్మకత అందరికీ తెలిసేలా చేస్తుంది. ప్రజలు మరింత సృజనాత్మకంగా ఫొటోలు, వీడియోలు, కథనాలు వంటి వారి సృజనాత్మక పనిని భాగస్వామ్యం చేయడానికి సోషల్ మీడియాను ఉపయోగించవచ్చు.

సమాజంలోని అన్ని వర్గాల వాయిస్ ఎలా ఉందో తెలుపుతుంది. అసలు సమాజం ఎలా ఉందో తెలుపుతుంది. సాంస్కృతిక మార్పులను తెస్తుంది. ప్రజలను అన్ని రంగాలలో చైతన్యపరుస్తుంది. ఇది ప్రజల నుండి వ్యక్తుల మధ్య పరస్పర చర్యను అందిస్తుంది. ఇది అడ్డంకులను విచ్ఛిన్నం చేస్తుంది. నిజమైన మానవ సంబంధాలను ఏర్పరుస్తుంది. సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని అందిస్తుంది. ఉదాహరణకు 'మీటూ' బాధితుల కథనాలను బయటకు తీసుకు రావడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషించింది. విపత్తు సమయాల్లో అధికారులను చేరేందుకు అక్కడ వాస్తవ పరిస్థితులను అందరికీ తెలిసేలా చేసి సహాయక చర్యలు చేసేవారి సంఖ్యను పెంచుతుంది. విపత్తు నిర్వహణ సంస్థలు ప్రజల మనోభావాలు, వారి అవసరాలు, తక్షణ సాయం అవసరమయ్యే ప్రాంతాలను గుర్తించగలవు. విపత్తు సహాయం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం లాంటి వాటిలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాలను మారుమూల ప్రాంతాలకు చేరవేసి వారి బాధలను తీర్చడంలో సహాయపడుతుంది.

## రాజకీయ ప్రయోజనాలు

సోషల్ మీడియా ఎన్నికల ప్రచారాలలో అంతర్భాగంగా మారింది. రాజకీయ ప్రచారాలను నిర్వహించే విధానంలో సోషల్ మీడియా విప్లవాత్మక మార్పులు తెచ్చి కొత్త కోణాన్ని జోడించింది.

ఎన్నికల సమయంలో పోటీ చేసేవారు ఎన్నికల ప్రచారాన్ని సోషల్ మీడియా ద్వారా చేస్తున్నారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లను సులభంగా దగ్గరవుతున్నారు. రాజకీయ పార్టీలు ఓటర్లతో మరింత వ్యక్తిగత, ప్రత్యక్ష స్థాయిలో కనెక్ట్ అయ్యేలా చేసింది. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ప్రజలకు చేరుకోవడంలో కీలక పాత్ర పోషించాయి.

పార్టీలు తమ విధానాలను తక్కువ నిడివిగల వీడియోల ద్వారా సోషల్ మీడియాని ఉపయోగించుకొని వారి మేనిఫెస్టోను మారు మూల ప్రాంతాలకు తీసుకెళ్లగలిగారు. ముఖ్యంగా ఈ ప్లాట్‌ఫార మ్‌లతో మరింత చురుకుగా ఉండే యువతరానికి చేరువయ్యా రు. ఫీడ్ బ్యాక్ ద్వారా ప్రజల ఆశలను, ఆశయాలను, సెంటిమెంట్‌ను అంచనా వేసి తదనుగుణంగా తమ ప్రచార వ్యూహాలను సర్దుబాటు చేయడంలో సహాయపడ్డాయి.

## ప్రతికూలతలు

నకిలీ వార్తలు, తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చేయడం ప్రజాస్వామ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తప్పుడు వార్తలు దావానంలా వ్యాప్తి చేయడానికి సోషల్ మీడియా నేడు ప్రధాన వనరుగా మారింది. దీని వలన జాతీయ వ్యతిరేక, సామాజిక వ్యతిరేక ప్రచారాలు జరిగి అల్లర్లు జరగొచ్చు. తీవ్రవాద సంస్థలు, తీవ్రవాదులు విద్వేషపూరిత హింసాత్మక భావజాలాలను వ్యాప్తి చేయడానికి, మిలిటెంట్లను రిక్రూట్ చేయడానికి, సామాన్య ప్రజలను ప్రభావితం చేయడా నికి సోషల్ మీడియాను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఇది దేశ భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తోంది. సోషల్ మీడియా ద్వారా హనీ ట్రాపింగ్ దేశ భద్రతకు కూడా ముప్పు కలిస్తుంది. సోషల్ నెట్ వర్కింగ్ సైట్ ద్వారా దేశం అంతర్గత భద్రతకు అతి పెద్ద సవాలు సైబర్ ఉగ్రవాదం. మానవ ప్రవర్తనపై సోషల్ మీడియా ప్రతికూల ప్రభావాలు ఉన్నాయి. వ్యక్తులు స్క్రోలింగ్ చేయడానికి, నోటిఫికేషన్‌లను తనిఖీ చేయడానికి సందేశాలకు ప్రతిస్పందించడానికి గంటల తరబడి గడపవచ్చు. ఇది నిద్రలేమి, ఒంటరితనం, పనిచేసే ప్రదేశంలో ఉత్పాదకత తగ్గడం వంటి సమస్యలకు దారి తీస్తుంది. ఇది విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తుంది. వారి విద్యా స్థాయిలపై ప్రభావితం చేస్తుంది. ఎక్కువ సమయం గడిపే వ్యక్తులు ఆందోళన, నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. ఇది ఒక వ్యసనంగా మారొచ్చు. సోషల్ నెట్‌వర్కింగ్ సైట్‌లుకూడా ముఖ్యమైన భద్రతా చిక్కులను కలిగి ఉంటాయి. వ్యక్తిగత డేటా బహిర్గతమవడం, గోప్యతా ఉల్లంఘనల ప్రమాదం ఒక ప్రధాన ఆందోళన. వినియోగదారుల ఆసక్తులు, ఆర్థిక వివరాలతో సహా పెద్ద మొత్తంలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకుంటారు. వీటిని ఉపయోగించుకొని కొంతమంది సైబర్ నేరగాళ్లు బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తరచుగా హ్యాకర్లచే లక్ష్యంగా ఉంటాయి. ఇది పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డ్ నంబర్‌లు, ఇతర సున్నితమైన సమాచారంతో సహా అన్ని వినియోగదారులల డేటా దొంగతనానికి దారి తీస్తుంది. నకిలీ ఖాతాలు, ఆన్‌లైన్ స్కామ్‌ల విస్తరణ ప్రమాదాలను మరింత పెంచుతుంది. ఇవేవీ తెలియని కొంతమంది వినియోగదారుల ఫిషింగ్ ప్రయత్నాలకు లేదా మోసపూరిత పథకాలకు గురవుతారు. వినియోగదారుల ఫోన్ నంబర్ల వివరాలను కొన్ని వాణిజ్య ప్రకటనల సంస్థలకు విక్రయించి లాభపడతారు. కొంతమంది వ్యక్తులు, కంపెనీలు, సంస్థలు స్వార్థ ప్రయోజనాల కోసం తమ ప్రచారాన్ని వ్యాప్తి చేయడానికి సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారు.





సాంకేతిక పురోగతి నీరసమైన జీవనశైలికి ఒక మార్గాన్ని సృష్టించింది. ఇది పిల్లల నుండి పెద్దల వరకు అన్ని తరాలను ప్రభావితం చేసింది. ఈ రోజుల్లో యుక్త వయస్కుల జీవితాలు మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో, ఇంటర్నెట్‌లో గణనీయమైన సమయాన్ని వెచ్చించడాన్ని కలిగి ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా చాలామంది వ్యక్తులు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా నెట్‌వర్కింగ్ సైట్‌లను ఉపయోగిస్తున్నందున, కొన్నిసార్లు దాని వినియోగదారులు ఈ గోప్యతా ఉల్లంఘనలన్నింటికీ హాని కలిగి వుంటారు. సోషల్ మీడియా అందరికీ అందుబాటులో ఉన్నందున, వ్యక్తిగత గోప్యతకు సంబంధించిన ఆందోళన కూడా ఒక ముఖ్యమైన ప్రశ్నగా మారింది. ఈ బెదిరింపులన్నీ సమాజంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.

## టీనేజర్లపై ప్రభావం

నేటి యుక్తవయసులో సోషల్ మీడియా వినియోగం దాదాపుగా సార్వత్రికమైనది. ముఖ్యంగా పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం ఎంత బలంగా ఉందో అధ్యయనాలు షాకింగ్ డేటాను వెల్లడించాయి. 9-13 సంవత్సరాల మధ్యవయస్సు గల పిల్లలలో 62, 13-17సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లలలో 49శాతం మంది రోజులో కనీసం 3గంటలు సోషల్ మీడియాలో గడిపారు. ఈ వయస్సులో ఉన్నవారిలో 97శాతం మంది ఏడు ప్రధాన ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో కనీసం ఒకదానిని ఉపయోగిస్తున్నారని నివేదించింది. కొంతమంది విద్యార్థులు రోజుకు వందకుపైగా రీల్స్ లేదా షార్ట్స్ చూస్తారని కొన్ని అధ్యయనాలు తెలుపుతు న్నాయి. సోషల్ మీడియాలో పరిచయమైన వారందరూ నిజమైన స్నేహితులు కాదు. సోషల్ మీడియాలో చాలా అకౌంట్లు ఫేక్. ఆకర్షించడానికి అందమైన అమ్మాయి ఫోటో లేదా అబ్బాయి ఫోటో ప్రొఫైల్ పిక్ పెడతారు. అవి నిజమనుకొని వాళ్లతో చాటింగ్ లేదా ఇంకేదైనా మార్గంలో మన వ్యక్తిగతమైన ఫోటోలు, బ్యాంక్ అకౌంట్, క్రెడిట్‌కార్డ్, డెబిట్ కార్డ్ వివరాలు షేర్ చేస్తారు. అప్పటి నుండి మనకు ఆర్థిక లేదా మానసిక కష్టాలు, నష్టాలు ప్రారంభం అవుతాయి. చాలా విషయాల మాదిరిగానే, సోషల్ మీడియాను ఉపయోగించడంలో దాని సానుకూలతలు, చెడు ప్రమాదాలు, చాలామంది జీవితాలపై ప్రభావం చూపుతాయి. పిల్లలు సోషల్ మీడియాలో షార్ట్స్, రీల్స్, తక్కువనిడివి గల వీడియోలు చూసినప్పుడు మెదడులో ఆనందంతో కూడిన



వారి ప్రవర్తన రోజువారీ జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. తీవ్రమైన సందర్భాల్లో బాధితులు ఆత్మహత్యకు కూడా పాల్పడవచ్చు.

## సైబర్ బెదిరింపు

ఇది సోషల్ మీడియా, మెసేజింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, మొబైల్ ఫోన్‌లలో జరుగుతుంది. ఇది లక్ష్యంగా చేసుకున్న వారిని భయపెట్టడం, కోపం తెప్పించడం లేదా అవమానించడం లక్ష్యంగా పునరావృతమయ్యే ప్రవర్తన. ఉదాహరణకు సోషల్ మీడియాలో ఒకరి గురించి అసత్య ప్రచారం చేయడం లేదా ఇబ్బంది కలిగించే ఫొటోలు లేదా వీడియోలను పోస్ట్ చేయడం. దాదాపు 33శాతం మంది ఆన్‌లైన్ బెదిరింపులను ఎదుర్కొన్నారు. ఇది వారి మానసిక ఆరోగ్యంపైన ప్రతికూల ప్రభావం చూపుతుంది.

రసాయనపదార్థాలు విడుదలవుతాయి. అందువలన ఇటువంటివి చూడడానికి బానిస అవుతారు. సోషల్ మీడియాలో ఎక్కువగా గడపడం వలన డిప్రెషన్, యంగ్జయిటీ, క్రానిక్ స్ట్రెస్‌తో పాటు ఆత్మహత్య ధోరణుల వంటి మానసిక రుగ్మతలకు గురవుతారు.

## పిల్లలు బయటపడేదెలా!

సోషల్ మీడియా మంచి విషయమే కావచ్చు. కానీ టీనేజ్ పిల్లలు సోషల్ మీడియాలో చూసే లేదా చదివిన దాని గురించి ఎప్పుడైనా అసౌకర్యంగా భావిస్తే వారు తమ స్వంత భావాలను విశ్వసించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా మరొక విశ్వసనీయ పెద్దవారితో మాట్లాడాలి. సోషల్ మీడియా ప్రజలను, ముఖ్యంగా పిల్లలను ఎలా బాధపెడుతుందనే దాని గురించి అవగాహన చేసుకోవడం చాలా ముఖ్యం. వీటికి సైకాలజీ భాషలో రకరకాల పేర్లు ఉంటాయి. పేర్లతో మనకు సంబంధం లేదు. మనం నష్టపోయామా? లేదా? అని ఆలోచించుకోవాలి. పిల్లలపై ప్రభావాలను పరిమితం చేయడానికి పెద్దలు చర్యలు తీసుకోవాలి. సోషల్ మీడియా ప్రదర్శించబడుతున్న కంటెంట్‌ను కూడా పర్యవేక్షించాలి. పిల్లలు మొబైల్‌ఫోన్ వినియోగిస్తున్నప్పుడు ఓ కంట కనిపెడుతూ ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతాయుతమైన పెద్దలుగా ఉండాలి. టీనేజర్‌లకు సోషల్ మీడియాతో సంబంధం ఉన్న ప్రమాదాన్ని, ఆరోగ్యకరమైన పద్ధతిలో సోషల్ మీడియాలో ఎలా సురక్షితంగా ఉండాలో నేర్పించాలి. ఆన్‌లైన్లో యెటువంటి అనుభవాలు ఎదురవుతాయో పిల్లలకు తెలియపరచాలి. వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పంచుకోవడం ఎంత ప్రమాదకరమో, అపరిచితులతో స్నేహం చేయడం వల్ల కలిగే హానికరమైన నష్టాలు గురించి వారికి తెలియజేయాలి. టీనేజర్లకు సోషల్ మీడియాపై అవగాహన కల్పించాలి. దీని ప్రభావాన్ని పేర్కొనడం ద్వారా పిల్లలు తమను తాము సోషల్ మీడియాలో ఎలా ఉండాలో నేర్చుకుంటారు. సైబర్ బెదిరింపులు కలిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలో ముందుగానే తెలియజేయాలి. ఆన్‌లైన్ స్నేహితులతో కాకుండా చుట్టూపక్కన ఉండేవారితో కలిసి మెలసి ఉండడం నేర్పాలి.


## సోషల్ మీడియా ప్రమాదాలు

సోషల్ మీడియాను సక్రమంగా ఉపయోగించకపోవడం, తప్పుడు సమాచారాన్ని పంచుకోవడం, సైబర్ బెదిరింపులు, మార్ఫింగ్, గోప్యతను ఉల్లంఘించడం వంటి చట్టవిరుద్ధమైన కార్యకలాపాల్లో పాల్గొనడాన్ని సోషల్ మీడియా దుర్వినియోగం అంటారు. సామాజిక దుర్వినియోగం అనేది ప్రతి ఒక్కరికీ ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. మానసిక ఆరోగ్య సమస్యలు వంటి అనేక సమస్యలకు దారితీస్తుంది.

## ట్రోలింగ్

సోషల్ మీడియా వల్ల సాధారణంగా ఎక్కువశాతం మందికి ఎదురయ్యే ప్రమాదాలలో ఇదొకటి. ఆకతాయిలు వినియోగదారులపై ట్రోలింగ్ చేస్తారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇతరులను కలవరపరిచేలా ఆన్‌లైన్‌లో పోస్ట్ చేయడం లేదా వ్యాఖ్యానించడాన్ని ట్రోలింగ్ అంటారు.

కొంతమంది ఇతరులను వేధించడానికి ట్రోలింగ్ చేస్తారు. మహిళలు వారి గౌరవాన్ని తీవ్రంగా ప్రభావితం చేసి, బెదిరింపులకు పాల్పడతారు. కొంతమంది మహిళల అందం మీద, శారీరక ఆకృతి మీద వికృత పోసి రంగులు చేస్తారు. అతితక్కువ సమయంలో ఇది వైరల్ అవుతుంది. ట్రోలింగ్ తీవ్రమైన సమస్య. ఇది బాధితులకు గొప్ప మానసిక గాయం కలిగించవచ్చు.



**తప్పుడు సమాచారం**
తప్పుడు లేదా కల్పిత కథనాన్ని రూపొందించడం చివరికి గందరగోళానికి దారితీసి తప్పుదారి పట్టించి క్షోభకు గురిచేస్తారు.

**మార్ఫింగ్:** వారి ఫొటోని నగ్నచిత్రంగా మార్చి డబ్బులు గుంజుతారు.

## గోప్యతా ఉల్లంఘన

వ్యక్తిగత సమాచారం దొంగిలించబడి ఇంకొకరికి బహిర్గతం చేయడం. ప్రజల్లో అవగాహన లోపించినప్పే ఎక్కువగా సమాచారం లీక్ అవుతుంది. సాధారణంగా యువకులు దీని బారినపడతారు.

### దుర్వినియోగం నుండి ఎలా బయటపడాలి?

బలమైన మార్గదర్శకాలను అనుసరించడం అనేది సోషల్ మీడియా ఖాతా భద్రతను నిర్ధారించే దిశగా మొదటి అడుగు బలమైన పాస్‌వర్డు యాప్‌లు పెట్టుకోవాలి. వీటిని ఎవరికీ తెలియజేయగూడదు. సురక్షితమైన పరికరాల ద్వారా ఖాతాలను నిర్వహించాలి. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల కోసం మాత్రమే ప్రత్యేక ఇమెయిల్ ఖాతాను కలిగిఉండాలి. సోషల్ మీడియా అకౌంట్లకు వ్యక్తిగతంగా నియంత్రణ ఉండాలి. మరొకరికి నియంత్రించే సౌలభ్యం ఇవ్వకూడదు. పబ్లిక్ వైఫైలను వాడరాదు. వీలైనంతవరకూ స్వంత నెట్‌వర్క్ వాడాలి. ఎప్పటికప్పుడు మొబైల్ లేదా కంప్యూటర్లతోబాటు సోషల్ మీడియా యాప్‌ను అప్‌డేట్ చేసుకోవాలి. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల భద్రత సెట్టింగ్‌లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సోషల్ మీడియా కంపెనీలు సూచించిన విధంగా గోప్యతా ప్రమాణాలను పాటించాలి.





### సవాళ్లు-పరిష్కారాలు

మనదేశంలో సోషల్ మీడియా ఎదుర్కొంటున్న కొన్ని సవాళ్లు ఉన్నాయి. ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రతిరోజూ సోషల్ మీడియా ద్వారా ఎదురయ్యే అధునాతన సవాళ్లను పరిష్కరించగలిగే సాంకతిక నిపుణులతో నియంత్రణ వ్యవస్థ అవసరం. సోషల్ మీడియా వినియోగదారులు ధృవీకరించబడిన విశ్వసనీయ లింక్‌లపై మాత్రమే క్లిక్ చేయమని అవగాహన చేయాలి. అవగాహన వినియోగదారులను బాధ్యతాయుతంగా చేస్తుంది. సోషల్ మీడియా సవాళ్లకు వ్యతిరేకంగా పోరాడడంలో సహాయపడుతుంది.
సమాజంపై సోషల్ మీడియా ప్రభావాన్ని తటస్తం చేయడానికి ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగించాలి. నకిలీ వార్తలు వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం వాస్తవమైన ప్రామాణికమైన సమాచారాన్ని అందించాలి. దీని ద్వారా తప్పుడు సమాచారంతో పోరాడవచ్చు. నకిలీ వార్తలు, ద్వేషపూరిత ప్రసంగాలు, ఇతర సవాళ్లను అరికట్టడానికి ప్రభుత్వం కృత్రిమ మేధస్సును ఉపయోగించాలి.

### మనదేశంలో చట్టాలు

కొత్త ఐటీరూల్స్ 2021 భారతదేశంలో పనిచేస్తున్న సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లకు వర్తిస్తాయి. ప్లాట్‌ఫారమ్‌లు తప్పనిసరిగా చీఫ్ కంప్లయన్స్ ఆఫీసర్, నోడల్ కాంటాక్ట్ పర్సన్ గ్రీవెన్స్ ఆఫీసర్‌ను తప్పనిసరిగా నియమించాలి. నిర్దిష్ట కాలవ్యవధిలో వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడానికి వారు తప్పనిసరిగా ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయాలి. కోర్టు లేదా ప్రభుత్వ ఆదేశాల మేరకు చట్టవిరుద్ధమైన కంటెంటును సంబంధిత మీడియా సంస్థ ముప్ఫై ఆరుగంటలలో మీడియా ప్లాట్ఫారం నుండి తీసివేయడం లేదా నిలిపివేయడమో చేయాలి. చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీలకు అవసరమైనప్పుడు సందేశం లేదా కంటెంట్ మూలకర్తను సంబంధిత ప్లాట్‌ఫారమ్ తప్పనిసరిగా బహిర్గతం చేయాలి. డిజిటల్ మీడియా సంస్థలు తప్పనిసరిగా నీతి నియమావళికి స్వీయ నియంత్రణకు కట్టుబడి ఉండాలి.
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సవరణ నియమాలు 2023 ప్రకారం ఏదైనా ఆన్‌లైన్ కంటెంట్ తప్పుగా లేదా తప్పుదోవ పట్టించేదిగా భావించే వాటిని తీసివేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంది. ఈ నిబంధనల ప్రకారం, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, మధ్యవర్తులు ప్రభుత్వ ఆదేశాలను పాటించడంలో విఫలమైతే సేఫ్ హార్బర్ సూత్రం యొక్క రక్షణను కోల్పోతారు.

## ఎవరికి వారే బాధ్యులు

సోషల్ మీడియాలో ఏదైనా థర్డ్‌పార్టీ కంటెంట్‌ను షేర్ చేసే ముందు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. కంటెంట్ ఎజెండా లేదా ఉద్దేశం మనకు తెలిసినదై ఉండాలి. దీనిని సమర్థించే ఏవైనా ఆధారాలు ఉన్నాయా లేవా పరిశీలించాలి. కంటెంట్ తయారు చేసింది పేరున్న సంస్థా లేదా యాదృచ్ఛిక వినియోగదారుడా చూడాలి. సమాజంలో ఎటువంటి గందరగోళ పరిస్థితిని కల్గించే విధంగా ఉండకూడదు. విశ్వసనీయతను అంచనా వేయడానికి ధృవీకరణ కోసం ఫ్యాక్ట్ చెక్ పద్ధతి ఉపయోగించాలి. ఏవిపడితే అవి షేర్ చేయరాదు. అన్నింటికీ మనమే బాధ్యత వహించాలనే విషయం తెలుసుకోవాలి. ❏

# డ్రోన్ల తయారీలో దిట్ట



వ్యాపార నైపుణ్యానికి సాంకేతికత తోడుకావడం ఓ 'డెడ్లీ కాంబినేషన్' అంటోంది నేటి స్టార్టప్ ప్రపంచం. ఆ రెండింటికీ సామాజిక స్పృహా కూడా జతైతే-అది మరింత అద్భుత కలయిక అంటాడు 34 ఏళ్ల అగ్నీశ్వర్ జయప్రకాశ్. ఆ ఆదర్శమే భూమికగా తన 'గరుడ ఎయిరోస్పేస్' సంస్థతో అటు ఐపీఎల్ మ్యాచ్‌లకీ, ఇటు పంటపొలాలకీ డ్రోన్‌లని అందిస్తూ ఆ రంగంలో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఫార్చ్యూన్ ఇండియా పత్రిక '40 అండర్ 40' జాబితాలో వరసగా రెండేళ్లుస్థానం సంపాదించిన అగ్నీశ్వర్ స్ఫూర్తిదాయక ప్రస్థానం ఇది..పుట్టిన పిల్లలు బోర్లాపడాలి..అతను పడ్డాడు. దోగాడాలి..ఆడాడు. తప్పటడుగులు వేయాలి..వేశాడు. కానీ ఈ ప్రతిదశలోనూ ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యాడు. నాలుగడుగులు వేసినా తీవ్రమైన అలసటతో డీలాపడిపోయేవాడు. డాక్టర్లని సంప్రదిస్తే 'మీ బాబు ఊపిరితిత్తులు కేవలం 20శాతమే గాలిని తీసుకుంటున్నాయి. దీనికి చికిత్స లేదు. బహుశా ఎదిగేకొద్దీ మారొచ్చు..' అన్నారట. అప్పుడే ఇంకెవరో చెప్పారట. 'మీవాడికి ఈత కొట్టడం నేర్పండి. ఊపిరితిత్తుల సమస్యలు తగ్గొచ్చు..' అని. ఎంతో తటపటాయింపు తర్వాతే అతణ్ణి ఈతకొలనులోకి దించాడు వాళ్లనాన్న జయప్రకాశ్. ఆశ్చర్యకరంగా నేలకన్నా నీటిలోనే ఉత్సాహంగా ఆడటం మొదలుపెట్టాడట చిన్నారు అగ్నీశ్వర్! ఐదేళ్లకే ఈత నేర్చేసుకున్నాడు. పదేళ్లకి తాముంటున్న చెన్నై నగరస్థాయిలో ఈత ఛాంపియన్ అయ్యాడు. మెల్లగా రాష్ట్ర, జాతీయస్థాయుల కెళ్లాడు. 14 ఏళ్లప్పుడు అమెరికాలో జరిగిన ప్రపంచ ఈత ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని భారత్ నుంచి ఆ పోటీలో తలపడ్డ అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 17 ఏళ్లకే పాకిస్థాన్‌లో జరిగిన దక్షిణాసియా పోటీల్లో ఏడు బంగారు పతకాలు సాధించిన ఏకైక భారతీయుడిగా నిలిచాడు. 200 మీటర్ల 'ఇండివిడునయవల్ మెడ్లీ' (ఐఎం)లో 2.05 సెకన్లతో పోటీని ముగించిన తొలి భారతీయ క్రీడాకారుడు కూడా ఇతనే! అగ్నీశ్వర్ తల్లి భవాని న్యాయవాది. ఈతతో ఆరోగ్యం పుంజుకోవడం గమనించి సామాజిక సేవవైపు అతని దృష్టిని మళ్లించింది. ఖాళీ సమయాల్లో మురికివాడలకీ, అనాథాశ్రమాలకి వెళ్లడం తప్పనిసరి చేసింది. 'ఈత, చదువు, కళలూ పోను నా ఖాళీసమయమంతా అనాథాశ్రమాల్లో గడపడం అలవాటు చేసుకున్నాను. ఓ రకరంగా అదే నన్నో పెద్ద ఓటమి నుంచి బయటపడేసింది. నాకో కొత్తదారిని చూపించింది..' అంటాడు అగ్నీశ్వర్!

2012లో అది జరిగింది. ఆ ఏడాది క్వాలిఫయర్ పోటీల్లో కేవలం 0.3 సెకన్ల తేడాతో ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయాడు అగ్నీశ్వర్. ఒలింపిక్స్‌కి మళ్లీ వెళ్లే అవకాశం ఉన్నా అంతటితో చాలించుకున్నాడు. అప్పటికే సామాజిక సేవా కార్యక్రమాల్లో తలమునకలైపోయాడు. 22 ఏళ్లకి 'అగ్ని ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థని స్థాపించాడు. మురికివాడల్లోని పిల్లలకి చదువు చెప్పించడం వాళ్లు ఇంజినీరింగ్ మెడిసిన్‌లాంటివి చదవడానికి సాయం అందించడం చేస్తుండేవాడు. ఈత ఛాంపియన్‌గా ఉన్నప్పుడే బీటెక్ చేసిన అగ్నీశ్వర్..స్వచ్ఛంద సంస్థని స్థాపించాక అమెరికాలో ఎంబీఏ పూర్తిచేశాడు. అక్కడ బడిస్థాయిలోనే పిల్లల్ని ఇన్నొవేటర్స్‌గా మలచడం గమనించాడు. భారత్‌లోనూ ఇలా చేస్తే బావుంటుంద నుకున్నాడు. భారత్ వచ్చాక మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్‌కలాంతో తన ఆలోచనలు పంచుకున్నాడట. ఆయన గంటన్నరపాటు మాట్లాడి ఎన్నో సూచనలు అందించారట. అలా కలాం స్ఫూర్తితోనే, ఆయన చేతులమీదుగానే 'ఇగ్నైట్ ఇండియా' కార్యక్రమాన్ని మొదలుపెట్టాడు. సమాజానికి పీడిస్తున్న సమస్యలపైన శాస్త్రీయ పరిష్కారం చూపండని విద్యార్థుల్ని ప్రోత్సహించి, వాళ్ల ఆలోచనకి సాంకేతిక దున్నునివ్వడమే ఇగ్నైట్ ఇండియా లక్ష్యం. దేశంలోని ఏడువేల స్కూళ్లూ, కాలేజీలకి దాన్ని తీసుకెళ్లాడు. ఈ కార్యక్రమం వరసగా 2015, 2016లో భారత్ రాష్ట్రపతి అవార్డు అందుకుంది. అగ్నీశ్వర్‌ని 2017లో ఐక్యరాజ్యసమితి యూత్ అసెంబ్లీలో భాగంగా ఔట్‌స్టాండింగ్ డెలిగేట్ అవార్డు అందుకున్న ఏకైక భారతీయుడిగా నిలిపింది. 'ఇగ్నైట్ ఇండియా'లో భాగంగా ఓ రోజు విద్యార్థులతో మాట్లాడుతున్నప్పుడే పంటపొలాల్లో ఏనుగుల బీభత్సం గురించీ చర్చకొచ్చింది. దాని ఫలితంగానే ఏనుగుల దగ్గరకెళ్లి పెద్ద శబ్దం సృష్టించి వాటిని దారి మళ్లించే డ్రోన్‌ని సృష్టించారు. ఆ ఒక్క డ్రోన్‌తోనే ఆ విద్యార్థులే నిర్వాహకులుగా 'గరుడా స్పేస్' సంస్థకి బీజం పడింది. ఏనుగులని పారదోలే డ్రోన్‌ల తర్వాత, పంటపొలాల్లో పురుగుమందులూ ఎరువులూ పిచికారీ చేసే, అదునుచూసి నీళ్లు చల్లే, నాట్లువేసే డ్రోన్‌లని సృష్టించింది అగ్నీశ్వర్ బృందం. ఇప్పటిదాకా రైతులకి రెండువేల డ్రోన్‌లని అందించింది. వాటిని భారీ పరిశ్రమలకీ, సైన్యానికీ అందించే స్థాయికి ఎదిగింది. ఇస్రో, హెచ్‌ఏఎల్, ఓఎన్‌జీసీ, టాటా, గోద్రెజ్, రిలయన్స్‌లనీ తన వినియోగదారులుగా మార్చుకుంది. వీటన్నింటితోపాటే కేంద్రప్రభుత్వం చేపట్టిన డ్రోన్ దీదీ కార్యక్రమం కోసం యువతకి ఉచితంగా డ్రోన్ పైలట్ శిక్షణా అందిస్తోంది.

**నువ్వు** నాకిచ్చిన విలువైన జీవితంలో
ఆనందాల నెన్నింటినో అనుభూతించాను!
నా కోరికల సుమాలెన్నో వికసించాయి
ఆకాంక్షల కుసుమాలు సైతం విరబూశాయి
కానీ.. మనసారా నవ్వుకోలేకపోయాను.
విలాసవంతమైన నా జీవన నిర్మాణంలో
ప్రతి ఇటుకరాయీ నువ్వే.
స్వేదం చిందించిన శ్రామికుడివీ నువ్వే.
బంధాలనెన్నింటినో నాకందించి
నాకో అనుబంధాల కుటుంబాన్ని ప్రసాదించి
కానరాని లోకాలకు పయనమై వెళ్లిపోయావు!
నిరంతరమూ నీ జ్ఞాపకాలు



# స్వేదం చిందించిన శ్రామికుడు

నన్ను వెంటాడుతోంటే
వెక్కి వెక్కి ఏడ్చాను!
హృదయం రక్తసిక్తమైంది
నిలువెల్లా తనువు
రక్తపు ముద్దగా మారినవేళ
గొంతెత్తి విలపించాను

ఈవారం కవిత్వం

అయినా...
గుండెబరువు తగ్గలేదు!
నువ్వు పంచి ఇచ్చిన తీపి జ్ఞాపకాలు
క్షణక్షణం నా మదిలో కదలాడుతూ
నన్ను వేదనా సముద్రంలో ముంచివేశాయి
ఈ శోకపు సంకెళ్లు ఎప్పుడు తెగిపోతాయి?
నా కోసం మళ్లీ ఎప్పుడు పుడతావు నాన్నా!?

– విడదల సాంబశివరావు

# గుడిసె

కాలం
నా గుడిసె చుట్టూ నిశ్శబ్దంగా
ప్రవహిస్తోంది
చెట్టుకింద ఆకలితో
నిద్రలేని రాత్రులు
పువ్వులు వలె విచ్చుకుంటున్న ఆ చీకటి
జ్ఞాపకాలు
గుండెలో బాకుల్లా గుచ్చుకుంటున్నాయి
నా తోనే/ సూర్యుడు చంద్రుడు స్నేహం
కాలం ఇక్కడ పురుడు పోసుకుంటుంది
మోడుబారిన నా బతుకులో
గుండెకార్చిన కన్నీరు/ మళ్లీ ఊపిరి పోసుకుంటోంది
తడకల గదిలో
కాలం కళ్ల కేలండర్‌ని అతికించుకున్నాను
వాకిట్లో నాతో పలకరిస్తోంది
మామిడిచెట్టు రోజూ/ ఎన్నికల కోలాహలంలో
నేను గడ్డిపువ్వుగా మిగిలిపోయాను
మనస్సు ఆకలి రంగుల గాలిపటంలా
ఎగిరిపోతోంది
ఎండా వానా రెండూ నన్ను తడిపేస్తాయి
ఆకలిపువ్వు నా గుండెపై పూస్తుంది రోజూ.

– డాక్టర్ నల్లా నరసింహమూర్తి

# మబ్బుల చినుకులు

ఎప్పుడో కాని గుర్తుకు రావు
గుడిలోని దేవతకు..
నా మది జ్ఞాపకాలు
ఊహల్లో తేలియాడిన మబ్బుల చినుకులు
ముత్యమంత ముగ్గులతో
కుస్తీ పడతాయి
మరిచిపోయి మౌనంగా మిగిలిపోతే
దారంటూ మల్లెల పరిమళాలతో
పలకరిస్తాయి
కనిపించని నేస్తం
కళ్లలో వత్తులు వెలిగించుకుని
నా కోసం వెతుకుతున్న ఆశ
ఇంకా మిగిలేవుంది!
ఎప్పుడో ఒకప్పుడు నా గుండె కోవెలలో పొంగుతున్న
కోరిక తీర్చడానికి నా మనస్సు అలలు ఆ ప్రేమ కోసం
పడుతున్న తపన తెలిసి
పరుగు పరుగున రాకపోదా?
అప్పటివరకు ఎండమావుల ఎదురు చూపులు
జీవిత కాలమంతా తప్పవేమో!
ఆ కాలం కరుణిస్తే తప్ప.
ఆ గుండె మంటల సవ్వడి
పాల పొంగులా పొంగితే తప్ప.

– రవీందర్ కొండా

## 'శిలువధారి' కొర్రపాటి జేమ్స్



అరవై సంవత్సరాలకుపైగా తెలుగునాట, 'సహజకవి' 'రూపక ప్రవీణ', కవికోకిల జాషువా పురస్కార గ్రహీత' కొర్రపాటి జేమ్సు రచించిన నాటకం శిలువధారి ప్రదర్శింపబడు తుండటం అభినందనీయం. కరుణామయుడిపైన క్రీస్తుప్రభువు బాల్యం నుండి పునరుత్థానం వరకు, గద్యపద్య సాహితీ సమ్మిళితంగా కొర్రపాటి జేమ్స్ 'శిలుధారి'లో అద్భుతంగా కన్నులకు కట్టించారు. 8 ముద్రణలు విశేషకీర్తి ప్రాచుర్యం పొందిన ఈ నాటకం రచయితకు, పదికాలాలపాటు చిరఃస్మరణీయత ప్రసాదిస్తోంది. ఈ నాటకం, 11 రంగాలలో 15 ప్రధాన, 15 అప్రధాన పాత్రలతో క్రీస్తుచరిత్ర ఆనాటి చారిత్రక, సామాజిక, రాజకీయ నేపథ్యం ముఖ్యంగా ప్రగాఢమైన విశ్వాసంతో ఎంతో పరిశోధనాత్మకంగా నాటకీయత ఉట్టిపడేలా ప్రశంసనీయంగా రచయిత ప్రతిబింబింపచేసారు. తెలుగు ఆసక్తి ప్రేక్షక జనావళికి ఎంతగానో అలరిస్తున్న ఈ నాటకంలో పద్యరచన, కీర్తన రాగతాళ ప్రేక్షకులను తన్మయులు చేస్తాయనడంలో సందేహం లేదు. కరుణ రసాత్మక దృశ్య ప్రబంధాన్ని, తెలుగు ప్రేక్షక జనుల హృదయాలను ఆధ్యాత్మిక దివ్యానుభూతితో శిలువధారి తరింపచేస్తోంది.

**(శిలువధారి, రచన: కొర్రపాటి జేమ్సు, వెల: రూ 200, ప్రతులకు: కొర్రపాటి నాగరత్నమ్మ, కొమ్మూరు (పోస్టు), పెదనందిపాడు (వయా), గుంటూరు జిల్లా)**

– యర్రమిల్లి

## చిన్నారుల సృజనాశక్తిని వెలికితీసిన కథలు



మాడుగుల రాములు చొప్పదండి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు. ఆ పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులచే రాయించిన 84 కథల సంకలనం 'మాబడి పిల్లల కథలు'. ఈ కథలన్నీ చిన్నారులు తమ తల్లిదండ్రులు, అవ్వా,తాతల నుండి విని, సేకరించి రాములు ప్రోత్సాహంతో కథలుగా మలిచి మనకందిస్తున్నారు. సింహభాగం కథలు, 9,10వ తరగతి విద్యార్థి, విద్యార్థినులు రాసినవి కాగా 6,7,8వ తరగతి బాలబాలికలు రాసినవి కూడా ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి. కొన్ని కథలు పిల్లలు స్వంతగా రాసినవి వుండటం గమనార్హం. కథ రాయడమంటే సృజనాత్మక శక్తిని పెంపొందించుకోవడమే. సాహసము, భయము, దుఃఖము, వీరత్వము, సంబరము, హాస్యం యిలా పలు రసాలు ఈ కథల్లో ఆస్వాదించవచ్చు. నీతికథలు, ప్రబోధాత్మక కథలు, కుటుంబ సంబంధాలు, మానసిక విశ్లేషణ కథలు యిలా చిన్నారులు తమ శక్తి మేర కథలు అల్లారు. అపజయానికి కృంగిపోకుండా మళ్లీ, మళ్లీ ప్రయత్నిస్తే జయం మన స్వంతమవుతుంది అని బి.ఆశ్విత్ 'పట్టుదల' పేరిట కథరాస్తే, మడిపెల్లి శ్రీవిద్య స్వంతంగా రాసిన కథ 'తండ్రి-కూతుళ్లు'. మనం ఎవరినీ అతిగా ప్రేమించకూడదు. అలా అని ఎవరినీ చిన్నచూపు చూడకూడదు అనే నీతిని ప్రబోధిస్తు సాగిపోయిన కథ. వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే ఈ సంకలనంలోని కథలు చదవడం ఓ చక్కటి అనుభవం. **('అనగనగా..మాబడి పిల్లల' కథలు, రచన: మాడుగుల రాములు, వెల: రూ 200, ప్రతులకు: నవతెలంగాణ బుక్‌హౌస్)** – రమణ వెలమకన్ని

# పుస్తక సమీక్ష

## మూడుతరాల మనుషుల మూలభావనలు




మారుతోన్న కాలానికి అనుగుణంగా మనిషి కూడా మారాలి. ఎదురీదాలనుకున్నవారు కాల ప్రవాహానికి తట్టుకుని నిలవక తప్పదు. నవలంతా రమేష్ అనే మధ్యతరగతి స్కూలు టీచరు చుట్టూ నడుస్తుంది. కరీంనగర్ దగ్గరి లోయర్‌మానేరు డ్యాం నిర్మాణ సమయాన రమేష్ తండ్రి వెంకటయ్య వావిలాలపల్లె అనే చిన్న ఊళ్లో స్థిరపడి ఇల్లుకట్టుకుని బావి త్రవ్వించుకుంటాడు. చుట్టుముట్టున్న జనం బావి నీరు తోడుకుపోయేవారు. బాల్యం నుండి రమేష్‌కు ఆ బావి మీద మమకారం. కాలం మారి, ఆ చిన్నపల్లె కరీంనగర్‌తో కలిసిపోతుంది. 'రియల్ ఎస్టేట్ బూం' వల్ల ఆ బావిని పూడ్చి అపార్ట్‌మెంటు కట్టినా, రమేష్‌కు తన పాత బావి, ఇల్లు మీదే మమకారం. సాంప్రదాయికమైన భావాలు vs ఆధునికత మధ్య రమేష్ పడే భావోద్వేగాలు వర్ణిస్తూ, రచయిత చివరకు కాలానికి తలొగ్గవలసిందే నన్న సత్యాన్ని ప్రకటించి నవలను ముగిస్తారు. కవి, కథకుడిగా నిరూపించుకున్న ఈ రచయిత దాసరి మోహన్ నవలా ప్రక్రియను కూడా సమర్థవంతంగా రాయగలనని నిరూపించుకున్నారు. నవల ఆసాంతమూ, ఎన్నో జీవిత సత్యాలను, విశదపరుస్తుంది. ఎంతో తక్కువ చెప్పి ఎక్కువ ఆలోచింపచేసారనిపిస్తుంది.

**(వెంకటయ్య బావి, రచన: దాసరి మోహన్, వెల: రూ 120, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

– కూర చిదంబరం

## స్వీయాత్మక కథనం 'నేనూ-నావరం'



ఈ పుస్తకాన్ని కరవది సీతాలక్ష్మి, చెంచు సుబ్బారావు, మంచాళ స్వరాజ్యలక్ష్మీ, సీతారామారావులకు అంకితం చేసారు రచయిత్రి సరస్వతి. బ్లింం అన్నట్లుగా ఈ పుస్తకం 'పెళ్లి పెద్ద బోరు' అని ఫీల్ అయ్యే మొదటి పెళ్లిరోజు కూడా రాని జంటలు చదవాలి. ఆరుద్రగారు ఓ పాటలో అన్నట్లుగా 'అడుగడుగున తొలి దినములు గుర్తు తెచ్చుకో..తడబడి పొరబడితే తప్పుదిద్దుకో' ఇలా సాగుతుంది ఆపాట. ఇవి సరస్వతీ వరం జంట మధురజ్ఞాపకాలు. 37 ఏళ్ల డైరీలు..ఈ పుస్తకానికి దివాకరబాబు మాడభూషి 'ఆమెకు ఆమె వరం అంటూ గుర్తు వాక్యం' రాసారు. రచయిత్రి విద్యావంతురాలు. బ్యాంక్‌లో పనిచేసి పదవి విరమణ చేసారు.నటన, నాట్యంలో కూడా అభిరుచి ఉన్నది. వీరి కథలు పత్రికల్లో ప్రచురణై పాఠకాదరణ, పలు'బహు'మతులు పొందాయి. ఈ పుస్తకంలో ఉమ్మడి కుటుంబం, అర్ధనారీశ్వరం, పిల్లల పెంపకం, సెలవుల ప్రణాళిక, వరంతో టీవీ. సినిమా చూడటం విడాకులా?, తమల పాకులా? పండుగ సంబరం దారి చూపిన దేవతా, ప్రేమ కలిపిన కాఫీ లాంటి వ్యాసాలు పాఠకులకు స్వీయాను భూతుల్లోకి తీసుకెళతాయి. నమ్మకం, ప్రేమ, స్వచ్ఛత, స్నేహం ప్రతిజంటకు అవసరం అని తెలుపుతుంది ఈ పుస్తకం. **(నేనూ-నావరం, రచన: సరస్వతి కరవది, వెల: రూ 150, ప్రతులకు: సరస్వతి, ప్లాట్ నం. 305, మైహోమ్ విహంగ, హైదరాబాద్)** – తంగిరాల చక్రవర్తి

మహాభారతం భారతీయ సమాజానికి ఆదర్శం. ఈ మహోన్నత ఇతిహాసం పంచమవేదంగా గుర్తింపు పొందింది. సమాజంలో జరిగే అనేక అంశాలకు అద్దంపడుతుంది. అందుకే 'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్' అంటారు. అంటే మహాభారతంలో ఏది ఉందో అది అన్ని చోట్ల ఉంది. ఇందులో లేనిది మరెక్కడా లేదు అని అర్థం. ఇందులో అనేక సామాజిక అంశాలతో పాటు కుటుంబ వ్యవస్థ, తండ్రిపాత్ర ఎలా ఉండాలో కూడా గ్రహించవచ్చు.




# నాన్నే నా హీరో

డాక్టర్ ఎన్.బి.సుధాకర్‌రెడ్డి,
సైకాలజిస్టు

ధృతరాష్ట్రుడు పుట్టుకతోనే అంధుడు. అయినా తన భార్యగాంధారి ద్వారా వందమంది కుమారులు, ఒక కుమార్తెకు జన్మనిచ్చారు. పెద్దకుమారుడు దుర్యోధనుని శక్తి, సామర్థ్యాలు గల వ్యక్తిగా తీర్చిదిద్దారు. కురుసామ్రాజ్యానికి రాజును చేశారు. అయితే అతనిలోని కొన్ని ప్రతికూల భావాలను సరిదిద్దలేకపోయారు. దీనితో కౌరవ, పాండవుల మధ్య యుద్ధం అనివార్యమయింది. ఆఖరికి కురువంశం నాశనం అయ్యింది. పాండవ మధ్యముడైన అర్జునుడు గొప్ప విలువిద్యా ప్రవీణుడు. సవ్యసాచిగా కీర్తి గడించారు. శ్రీకృష్ణుని సారథ్యంతో కురుక్షేత్ర సంగ్రామంలో విజేతగా నిలిచారు. అయితే చిన్నపాటి జాగ్రత్త తీసుకోకపోవడం వల్ల తన కుమారుడు అభిమన్యుడిని పోగొట్టుకున్నారు. అభిమన్యుడు తల్లి గర్భంలో ఉండగానే పద్మవ్యూహం గూర్చి తెలుసుకున్నాడు. ఒకసారి అర్జునుడు గర్భవతి అయిన తన భార్య సుభద్రకు యుద్ధవిద్యలో పద్మవ్యూహం గూర్చి వివరించారు. అప్పుడు గర్భంలో ఉన్న అభిమన్యుడు ఆవిద్యను అర్థం చేసుకున్నాడు. అయితే పద్మవ్యూహంలో ప్రవేశించడం గూర్చి చెప్పిన అర్జునుడు ఛేదించి బయటకు రావడం ఎలాగో చెప్పలేదు. అప్పటికే సుభద్ర నిద్రలోకి జారుకోవడంతో అర్జునుడు ఆపేశారు. దీనితో అభిమన్యునికి బయటపడే ప్రక్రియ తెలియక ప్రాణాలు కోల్పోయాడు. అర్జునుడు కొంత శ్రద్ధ చూపి అభిమన్యునికి పద్మవ్యూహం గూర్చి పూర్తిగా నేర్పి ఉంటే అతను విజేతగా నిలిచిఉంటారు. పద్మవ్యూహం గూర్చి పాండవుల పక్షంలో శ్రీకృష్ణుడు, అర్జునుడు, శ్రీకృష్ణుని కుమారుడు ప్రద్యుమ్నుడికి మాత్రమే తెలుసు. ప్రద్యుమ్నుడు మహాభారత యుద్ధంలో పాల్గొనని చెప్పేశారు. సమయానికి అర్జునుడు లేకపోవడంతో అభిమన్యుడు రంగంలోకి దిగవలసి వచ్చింది.

## పెంపకమే కీలకం

ప్రతి తల్లి, తండ్రి తమ పిల్లలు చాలా గొప్పవారు కావాలని కోరుకుంటారు. కొందరు తపిస్తారు కూడా. తమ సంపాదనలో అధికశాతం పిల్లల కోసం ఖర్చుపెడతారు. అయితే అందరూ అనుకున్నస్థాయిలో రాణించలేరు. ఎక్కడో ఒకరు, ఇద్దరు తండ్రికి మించిన తనయులు లేదా కూతుర్లు పేరు తెచ్చుకుంటారు. అతికొద్దిమంది తండ్రికితగ్గ పిల్లలు అనిపించుకుంటారు. అధికశాతం మంది సహజసిద్ధంగా ఎదిగి జీవనం సాగిస్తారు. కొద్దిమంది పతనమై చెడపుట్టారు అన్న పేరు తెచ్చుకుంటారు. అందుకే అంటారు కంటే సరిపోదు వారిని ఉన్నతులుగా పెంచినపుడే సార్థకం అని. ప్రతి తల్లి, తండ్రి పిల్లలకు ఆదర్శంగానే కనిపిస్తారు. అధిక శాతం వ్యక్తిత్వ నిర్మాణం, ప్రవర్తన, సామాజిక స్పృహ కుటుంబ వాతావరణం పెంపకం మీద ఆధారపడి ఉంటుంది. నిజానికి తల్లి పిల్లలను కని పెంచుతుంది. అందుకే ఆమెను ఆదిగురువు అంటారు. అయితే తండ్రి పాత్ర అధికంగా ఉంటుంది. ప్రతి తండ్రి పిల్లలకు మార్గదర్శకుడు కావాలి. పిల్లలను అతిగారాబం చేసినా, అతిక్రమ శిక్షణతో పెంచినా నష్టమే జరుగుతుంది. పిల్లల పెంపకం గూర్చి మనం పశువులు, పక్షులు, జంతువుల నుంచి చాలా నేర్చుకోవచ్చు. పులి, పిల్లి, కుక్క, కోడి, ఇతర ప్రాణులను నిశితంగా పరిశీలిస్తే కొన్ని అంశాలు బోధపడతాయి. ప్రతి ప్రాణి తన పిల్లలను అతి జాగ్రత్తగా పెంచి పోషిస్తుంది. జాగ్రత్తగా కాపాడి, ఆహారం పెట్టి, ప్రకృతిలో బతకడానికి అవసరమైన మెలకువలు నేర్పిస్తుంది. శత్రువుల నుంచి తప్పించుకోవడం, ప్రాణాలు కాపాడుకోవడం నేర్పిస్తుంది. మనిషికి తప్ప మిగిలిన జీవరాశులన్నీ జ్ఞానేంద్రియాల ఆధారంగానే జీవితం, జీవనం సాగిస్తాయి. కాబట్టి అవి అడ్డదిడ్డంగా పని చేయవు. మనిషికి బుద్ధి, వికాసం, వివేకం ఆలోచనలు ఉండటం వల్ల ఎదిగేకొద్దీ ఎన్నో మార్పులు వస్తాయి. ఆశలు, కోర్కెలు, లక్ష్యాలు మారుతుంటాయి. ప్రవర్తనలో తేడాలు వస్తుంటాయి. ఆకర్షణలు, వ్యసనాలు దారి తప్పిస్తుంటాయి. అడ్డదారులు, అక్రమాలు చేసేలా పరిస్థితులు ప్రోత్సహిస్తుంటాయి. కాబట్టి తల్లిదండ్రులు ముఖ్యంగా తండ్రి పిల్లల పెంపకం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంత తీరిక లేని పనిలో ఉన్నప్పటికీ పిల్లలకు సమయం కేటాయించాలి.

కేవలం డబ్బు ఇచ్చాం, కోరింది కొనిచ్చాం, పేరున్న పాఠశాలల్లో, కళాశాలల్లో చదివించామంటే సరిపోదు.

## పంచసూత్రాలు పాటించాలి

పిల్లల పెంపకంలో పంచసూత్రాలు పాటించాలి. అందులో మొదటిది సంరక్షణ. పిల్లలు పుట్టినప్పటి నుంచి వారి సంరక్షణ పట్ల శ్రద్ధ వహించాలి. వారి ఎదుగుదలకు అవసరమైన ప్రోత్సాహం అందించాలి. నిద్ర, ఆహారం, ఆరోగ్యం, ఎదుగుదలను గమనించి సహకారం అందించాలి. అసలు తల్లి గర్ణభణభం నుంచే జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. గర్భం దాల్చిన స్త్రీని అత్త, మామ, భర్త, తల్లి, తండ్రి, కుటుంబ సభ్యులు ప్రేమతో చూసుకోవాలి. ఆమె మానసిక, శారీరక ఆరోగ్యం కడుపులోని బిడ్డపై ఉంటుంది. శారీరకంగా నీరసం, నిస్సత్తువ ఉంటే పుట్టే బిడ్డ బరువు తక్కువగానో, నెలలు నిండకముందే పుట్టే అవకాశం ఉంటుంది. అలాగే భయం, ఆందోళన, మానసిక వేదన, దిగులు, డిప్రెషన్‌తో బాధపడే తల్లికి పుట్టే పిల్లలో మానసిక సమస్యలు, ప్రవర్తనా లోపాలు కలిగే అవకాశాలను కాదనలేం. కాబట్టి కాబోయే తండ్రి ముందుగా భార్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. సంరక్షణతోపాటు సరైన శిక్షణ ఇవ్వాలి. క్రమశిక్షణ నేర్పాలి. పొరపాట్లు చేస్తే సరిదిద్దాలి. సక్రమంగా చేయడం ఎలాగో నేర్పాలి. పనులు చేయడం నేర్పాలి. ఆట, పాటలు అలవర్చాలి. చదువులో తోడ్పాటు అందించాలి. దీనితో పాటు వ్యక్తిత్వం, శీల ర్మాణం పట్ల శ్రద్ధ చూపాలి. నడత, నడవడిక నేర్పాలి. కథలు చెప్పాలి. సామాజిక స్పృహ కలిగించాలి. పిల్లలు దారి తప్పుతుంటే నియంత్రించాలి. వివేకం కల్పించాలి. అవసరం అయితే సైకాలజిస్టుల లేదా విజ్ఞుల సలహాలు తీసుకోవాలి. అవసరం అయినప్పుడు దండించాలి. పిల్లలను దారిలో పెట్టవలసి వచ్చినప్పుడు కఠినంగా వ్యవహరించినా తప్పులేదు. అందుకే పూర్వీకులు 'దండం దశ గుణం భవేత్' అన్నారు. అంటే దండిస్తే భయం, భక్తి, వినయం, విధేయత తదితర మంచి గుణాలు అబ్బుతాయని అంటారు. అయితే విపరీత దండన మాత్రం మంచిదికాదు. తండ్రి పిల్లల వెంట పెట్టుకుని పెళ్ళిళ్ళు, ఇతర వేడుకలకు వెళ్లడం చాలా అవసరం. దీని వల్ల పిల్లలకు ప్రజాసంబంధాల నిర్వహణ అలవడుతుంది. జీవితంలో రాణించడానికి అవసరమైన మెళకువలు నేర్చుకుంటారు.



## ఒత్తిడి తగదు

కొందరు తల్లిదండ్రులు ప్రధానంగా తండ్రులు పిల్లలను ఒత్తిడికి గురి చేస్తుంటారు. తమ ఆశలు నెరవేర్చుకోవడానికి పిల్లల మీద తమ అభిప్రాయాలు రుద్దుతు ఉంటారు. అలాకాకుండా పిల్లల శక్తి, సామర్థ్యాలు, తెలివితేటలు, ప్రతిభ, పాటవాలు, నైపుణ్యాలకు తగినట్టుగా ప్రోత్సాహం అందించాలి. అంతేతప్ప ఇష్టం, సామర్థ్యం లేకపోయినా ఒత్తిడి చేసి, చదివించడం మంచిది కాదు. అంటే ఇష్టం లేని కోర్సులు చదివించడం తగదని అర్థం చేసుకోవాలి. సహజంగా పెంపకం తీరును బట్టి తండ్రులను నాలుగు రకాలుగా చెపుతుంటారు. మొదటిరకం తండ్రులను నియంతలుగా వర్గీకరిస్తుంటారు. వీరు తాము చెప్పిందే వేదం అన్నట్టు చెబుతుంటారు. అతిక్రమశిక్షణ అమలు చేస్తుంటారు. పిల్లలతో ఆడుకోనివ్వరు. సరదాలు, షికార్లు చేయడానికి అనుమతించరు. ఇలాంటి తండ్రిలవల్ల పిల్లల్లో ప్రవర్తనాలోపాలు తలెత్తుతాయి. స్వేచ్ఛాపూరిత తండ్రులు కొందరు ఉంటారు. వారు పిల్లలకు పూర్తి స్వేచ్ఛనిస్తారు. అడిగినంత డబ్బు ఇస్తారు. గారాభంగా పెంచుతారు. ఆడిందే ఆటగా పాడిందే పాటగా తిరిగేందుకు అవకాశం ఇస్తారు. దీనివల్ల కూడా పిల్లలు దారి తప్పే అవకాశాలు ఉన్నాయి. మరికొందరు చాలా నిర్లక్ష్యంగా ఉంటారు. పిల్లలను కనగలం కాని వారి తలరాతలను రాయగలమా అంటూ వేదాంత ధోరణిలో మాట్లాడుతుంటారు. పిల్లల విషయాలు ఏదీ పట్టించుకోరు. దీనివల్ల పందిరి లేని మల్లెతీగలా పిల్లలు ఎటుబడితే అటుపోతారు. అతికొద్దిమంది స్నేహపూరిత తండ్రులు ఉంటారు. వారు పిల్లలతో స్నేహంగా ఉంటూ తోడ్పాటు అందిస్తారు. వారి నైపుణ్యాలు, లక్ష్యాలు, ఆసక్తి తెలుసుకుని ప్రోత్సహిస్తారు. అండగా నిలబడతారు. అత్యున్నత శిఖరాలను అధిరోహించడానికి తగిన సహకారం అందిస్తారు. ఇలాంటి తండ్రులకు పుట్టిన పిల్లలు సమాజంలో ఎదిగి గుర్తింపు తెస్తారు.

## నాన్నే ఆదర్శం

చాలామంది గొప్పవారిని అడిగితే నాన్నే నాకు ఆదర్శం అంటుంటారు. నాన్నవల్లే నేను ఇంతటివాడిని అయ్యానని చెపుతుంటారు. అలాగే తల్లిసేవలు, సహకారాన్ని కీర్తిస్తుంటారు. నీతి, నిజాయితీ, సమాజంలో గౌరవం పొందుతూ పిల్లలను సక్రమ మార్గంలో పెంచిన తండ్రులకు ఇలాంటి పేరు దక్కుతుంది. జవహర్‌లాల్ నెహ్రూ జైల్లో ఉన్న సమయంలో కూతురు ఇందిరాగాంధీకి లేఖలు రాసేవారు. అవి ఆమె వ్యక్తిత్వ నిర్మాణానికి బాటలు వేశాయి. ప్రపంచం అబ్బురపడేలా ఆమె భారత ప్రధానిగా సేవలు అందించారు. ప్రపంచంలో ఎదిగిన చాలామంది తల్లి, తండ్రులే తమకు ఆదర్శం అనడం గమనించాలి. కాబట్టి ప్రతి తండ్రి పిల్లల పెంపకంలో చాలా జాగ్రత్త వహించాలి. ప్రతి వ్యక్తి చదువు, ఉద్యోగం, కెరీర్, ప్రమోషన్ సంపాదన కోసం కృషి చేస్తుంటారు. అయితే అన్నింటికంటే పిల్లలు కుటుంబం ప్రధానమన్న స్పృహ కలిగి ఉండాలి. పెంపకలోపం వల్ల పిల్లలు వ్యసనపరులు అయితే తండ్రి సంపాదించినదంతా పోగొట్టుకుం టారు. సంఘవిద్రోహశక్తులుగా మారితే వంశానికి, కుటుంబానికి అపకీర్తి తెస్తారు. మానసికంగా లోపాలు ఉంటే సమస్యగా మారుతారు. కాబట్టి ప్రతి తండ్రి ఆదర్శంగా మారాలి. ఎంతటి ఉన్నతమైన వృత్తి, ఉద్యోగం, పదవి, హోదాలో ఉన్నప్పటికీ తండ్రిగా కుటుంబ పెద్దగా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. తన సంపాదన, పేరు, ప్రతిష్ట, కీర్తిని పెంచేలా పిల్లలను పెంచాలి. తండ్రికి మించిన పిల్లల్లా తయారు చేయాలి. ❍

కథ

# గొర్రె ఉపాయం

నరసింహపురం గ్రామ పొలిమేరల్లో ఒక అడవి ఉంది. అందులో క్రూరమృగాలు ఉండేవి. ఆ గ్రామంలోని రాజయ్యకు కొన్ని గొర్రెలు ఉండేవి. అతడు ఒకసారి ఆ అడవి సమీపంలోకి వాటిని తోలుకొని పోయాడు.

ఒకరోజు ఆ మందలోని ఒక గొర్రెకు, దాని పిల్లకు చాలా దాహం వేసింది. అది తన బిడ్డతో పాటు మంద నుండి విడివడి ఒంటరిగా పక్కన ఉన్న వాగులో నీటిని తాగడానికి వెళ్లింది. ఆ గొర్రెల కాపరి దానిని గమనించలేదు. కానీ వాటిని దూరం నుండి ఒక పెద్దపులి గమనించింది. అది ఆ గొర్రెలను పట్టుకొనుటకు పరిగెత్తింది. దూరం నుండి ఆ పెద్దపులిని చూసిన ఆ తల్లిగొర్రెకు ఏం చేయాలో తోచలేదు. అది వెంటనే తన బిడ్డతో పాటు పరిగెత్తి ఒక చెట్లపొదల్లో దాక్కుంది. ఆ పెద్దపులి అక్కడి ఆ చెట్ల పొదవద్దకు వచ్చి ఆ గొర్రెల కొరకు వెతకసాగింది. ఆ పొదల్లో అది ఎంతో వెతికింది. కానీ దానికి గొర్రె, దాని పిల్ల కనిపించలేదు.



అప్పుడే అక్కడికి ఒక నక్క కూడా వచ్చింది. ఆ నక్క 'పులిమామా! ఆ గొర్రెలు ఎక్కడికి పోవు. అది తన బిడ్డతో పాటు ఇక్కడనే దాగి ఉంటుంది. సరిగా వెతుకు' అని అంది. పెద్దపులి ఎంత వెతికినా ఆ గొర్రెలు కనబడలేదు. చివరికి ఆ పెద్దపులి, నక్క నిరాశతో ఆ గొర్రెలు తప్పించుకొని పోయాయని అనుకొని అక్కడ నుండి వెళ్లిపోయాయి.

ఆ గొర్రె ఈసారి తన బిడ్డతో పెద్దపులి, నక్క కన్ను గప్పి మరొక చెట్లపొదలో దాక్కుంది. అప్పుడు దాని బిడ్డ 'అమ్మా! మనం రోజూ దాక్కొనే ఆ చెట్ల పొదల్లో దాక్కోకుండా కొత్తగా ఉన్న ఈ చెట్టుపొదల్లో ఈసారి ఎందుకు దాక్కున్నట్లు?' అని ప్రశ్నించింది. అది విన్న తల్లి గొర్రె 'ఓ బిడ్డా! నిన్ననే ఒక తోడేలు మనపై దాడిచేయడానికి వచ్చింది. అప్పుడు నేను నీతోపాటు అక్కడి చెట్ల పొదల్లో దాక్కున్నాను. అది ఈ పెద్దపులి దూరం నుండి గమనించడాన్ని నేను చూశాను. దానితోపాటు ఈ నక్క కూడా మనల్ని చూసింది. అందుకే ఆ పక్క ఈ పెద్దపులితోపాటు ఇక్కడకు మన కొరకు వచ్చింది. అది తినగా మిగిలిన ఆహారం కష్టపడకుండా తినవచ్చని ఈ సోమరి నక్క ఉద్దేశం. మనము ఈరోజు కూడా నీతోపాటు అక్కడ దాక్కుంటే వాటికి దొరికపోయేవారము. అందువలననే నేను ఆ చోటును మార్చి ఇక్కడ దాక్కోవాలని నిర్ణయించాను. ఎప్పుడు ఒకేచోట దాక్కోవడం మనకు క్షేమకరం కాదు. శత్రువులకు మనం దాక్కొనే చోటు గురించి ముందే తెలుసు కాబట్టి మనం చోటును మార్చాలి. కనుక అవి ఇక్కడకు కచ్చితంగా వచ్చి మనకోసం వెతుకుతాయని నాకు ముందే తెలుసు. అందుకే నిన్న దాగిన ఆ చెట్లపొదల్లో దాక్కోకుండా మనం ఈ కొత్త ప్రదేశంలో దాక్కున్నాము. ఇప్పుడు అర్థమైందా' అని అంది.

'అమ్మా! మరి ఒకవేళ ఆ పెద్దపులి, నక్క ఈ కొత్త చోటుకు వచ్చి వెతికితే మనం దొరికేవారం కదా!' అని అంది. అప్పుడు ఆ గొర్రె 'అవి ఇక్కడికి రావు. ఇక్కడ తిరిగే ఆ పెద్దపులికి, నక్కకు ఈ చెట్ల ఆకుల వాసన పడదు. ఆ సంగతి నాకు ముందే తెలుసు. అందువల్లనే నేను ఈ పని చేశాను. అందుకే మనం క్షేమంగా బయటపడ్డాం' అని అంది తల్లి. తన తల్లి ఉపాయానికి పిల్ల గొర్రె ఎంతో సంతోషించింది.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య




## బాలగేయం

### రేపటి పౌరులం



బాలలం మేము బాలలం
భావితరానికి వారసులం
భవితవ్యానికి ప్రతీకలం
దేశ సమగ్రతకు చిహ్నాలం
విజ్ఞతలో వెలుగులం
విజ్ఞానంలో ప్రమిదలం
విశ్వాసానికి సమిదలం
సంస్కారానికి కర్తలం
చదువులో ఉత్తీర్ణులం
సమాజంలో విఘ్నులం
సమానతలో ఘనులం
స్నేహంలో జ్యోతులం
ఆటల్లో ఔత్సాహికులం
గెలుపులో విజయులం
సత్యలో సమానులం
నవ్వతలో మెరుపులం
చిరునవ్వుల చిగురులం
మంచికి మారుపేరులం
ఎప్పటికీ చిరంజీవులం
మేటి బాలల దివ్వెలం
మేమే రేపటి పౌరులం
సన్మార్గానికి సూచికలం
బుడిబుడి బుడుగులం
ముద్దుముద్దు పిల్లలం.

– నరెద్దుల రాజారెడ్డి

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.ఎస్.క్రిష్,** కొవ్వూరు

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వ్యాయామానికి, యోగాసనాలకు గల తేడా ఏమిటి?

**జవాబు: క్రిష్!** ఈ రెండింటికీ చాలా తేడా ఉంది. వ్యాయామం శారీరక శక్తిని వినియోగించుకుంటుంది. యోగాసనాలు శారీరక, మానసిక శక్తులను సంరక్షిస్తాయి. వ్యాయామం చేయడం వల్ల మనలోని శక్తి వినియోగమై(ఖర్చు కాగలిగి), కండలు అవసరం లేని చోట కరిగి, అవసరమైన చోట వృద్ధి చెందుతాయి.

యోగాసనాలు వేయడం వలన శరీరం మన ఆరోగ్యానికి అనువుగా రూపొంది అతి తక్కువ శారీరక శక్తి వినియోగంతో ఆరోగ్య సంరక్షణ ఏర్పడుతుంది. నియమానుసారం వ్యాయామం చేసేవారు ఆహారం, నీరు అధిక మొత్తంలో తీసుకోవాలి. యోగాసనాలు వేసేవారు కూడా కచ్చితమైన ఆహార నియమాలు పాటించాలి.

**- ఎస్.సుభాషిత,** మెదక్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. జున్ను పాల విశిష్టత ఏమిటి?

**జవాబు: సుభాషిత!** గేదె ఈనిన తరువాత మొదటి మూడు రోజుల వరకు జున్నుపాలు(కొలోస్ట్రం) స్రవిస్తాయి. దూడ పెరుగుదలకి సంబంధించిన అనేక ముఖ్య పోషక పదార్థాలు ఈ జున్నుపాలలో ఉన్నాయి. ముఖ్యంగా దూడలకి కావలసిన వ్యాధినిరోధక శక్తి ఈ పాల ద్వారానే లభిస్తుంది. సాధారణ పాలతో పోల్చి చూస్తే ముర్రుపాలల్లో ఐరన్, కాపర్ అత్యధికంగా వుంటాయి. కొవ్వు పదార్థం, ప్రొటీన్, లాక్టోజ్, విటమిన్ 'ఎ' మొదలైనవి జున్ను పాలల్లో వుండే ముఖ్యమైన పదార్థాలు.







# మేనరికపు పెళ్లి

**హిందూ** వివాహ వ్యవస్థలో మేనరికపు వివాహాలు సర్వసాధారణంగా చూస్తుంటాం. కుటుంబాల మధ్య సంబంధాలు నిలిచి ఉండాలనే ఆలోచనతో కొంతమంది, ఆస్తుల పరిరక్షణ కోసం మరికొంతమంది మేనత్త, మేనమామ పిల్లల మధ్య మేనరికపు వివాహాలు జరుగుతుంటాయి. అయితే ఇలా మేనరికపు పెళ్లిళ్ల చేసుకున్న కొన్ని కుటుంబాల్లో పిల్లలు జెనెటిక్ లోపాలతో పుట్టడం లాంటివి కూడా చూస్తూ ఉంటాం. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 20శాతం పెళ్లిళ్ల దగ్గరి బంధువుల్లోనే జరుగుతున్నాయి. ఇలాంటి వివాహాలను వైద్యపరిభాషలో 'కన్‌సాంగ్వినియస్ మ్యారెజెస్' అంటారు. అసలు మేనరికపు పెళ్లిళ్ల చేసుకోవచ్చా? చేసుకుంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తెలుసుకోవాలి. బావ మరదలు పెళ్లి, మేనమామ మేనకోడలు పెళ్లి, ఇంకా రెండు కుటుంబాల మధ్య తరాల తరబడి కుండమార్పిడి అంటే వీళ్ల అమ్మాయిని, వారి అబ్బాయికి, వారి అబ్బాయిని వీరి అమ్మాయికి ఇచ్చి పెళ్లిళ్ల చేయడం సరైంది కాదు. సాధారణంగా రక్తసంబంధికులు కాని తల్లిదండ్రులకి పుట్టే పిల్లల్లో సుమారు 2-4శాతం మందికి చిన్న లేదా పెద్ద అవకారాలు పుట్టుకతో ఉండే అవకాశాలు ఉన్నాయి. అది సాధారణం. అయితే ఈ మేనరికపు వివాహాల్లో ఇది రెట్టింపు అవుతుంది. అయితే పిల్లలు అవకారాలతో పుట్టేస్థితి పైన చెప్పిన మూడింట్లో చివరిదాంట్లో ఎక్కువ. మొదటి దాంట్లో తక్కువ. ఈ ఎక్కువ తక్కువ పెళ్లి చేసుకున్న జంటలో భార్యభర్తల మధ్య జన్యుసారూప్యం ఎంత అన్నదానిబట్టి ఉంటుంది. బావమరదళ్ల కంటే, మేనమామ మధ్య జన్యుసారూప్యం ఎక్కువ. అలాగే కుండ మార్పిడిలో అవే జన్యువులు మాటిమాటికి పంచుకోవడం వలన ఇంకా ఎక్కువ. ఇటువంటి వివాహాలవలన అబార్షన్లు ఎక్కువవటం, మృత శిశువులు జన్మించటం, పుట్టినపిల్లలు తక్కువ బరువుతో పుట్టడం, గుండెలో అవకారాలు, బుద్ధిమాంద్యంతో పాటు ఇతర మానసిక సమస్యలు, మెదడు జబ్బులు, రక్తహీనత మొదలైన రకరకాల సమస్యలు చాలా ఎక్కువగా కలుగుతాయి. కానీ గుర్తు పెట్టుకోవాల్సి న విషయం ఏంటంటే ఈ అవకారాలు వచ్చే అవకాశాలు పెరుగుతాయి కానీ పుట్టే పిల్లలందరూ అవకారాలతో పుడతారని కాదు.



అయితే ఈ వివాహాలు మిగతా వివాహాల కంటే దృఢంగా ఉండటం, విడాకుల సంఖ్య తక్కువగా ఉండటం, ఆరోగ్య సమస్యలున్నప్పుడు రెండు కుటుంబాలూ సహాయపడటం మొదలైనవి లాభాలు. ఇటువంటి వాళ్ల పెళ్లిచేసుకునేముందు జెనెటిక్ కౌన్సిలింగ్ తీసుకోవాలి. దీనిలో ఇప్పటికే కుటుంబంలో ఉన్న వంశపారంపర్య జబ్బుల్ని కనుక్కుని, అవి పుట్టే పిల్లలకి వచ్చే అవకాశం లెక్కగట్టే చెబుతారు. దాన్నిబట్టి కాల్కులేటెడ్ రిస్క్ తీసుకోవచ్చు.

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంప గోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి.

కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com




# అతిపెద్ద నీటితొట్టె

**ప్రపంచంలోనే అతిపెద్ద నీటితొట్టెను నిర్మించేందుకు జపాన్ ప్రభుత్వం నడుం బిగించింది. ఈ నీటితొట్టె నిర్మాణం కోసం ఏకంగా ఒక కొండను తొలచడానికి సిద్ధపడింది. ఏకంగా 26కోట్ల లీటర్ల సామర్థ్యం గల ఈ నీటితొట్టె నిర్మాణానికి 400 మిలియన్ పౌండ్లు (రూ.4.191 కోట్లు) ఖర్చు చేయనుంది.**

విశ్వం ఆవిర్భావంలో కీలకమైన సూక్ష్మాతి సూక్ష్మకణాలైన న్యూట్రినోలను కనుగొనే లక్ష్యంతో జపాన్ ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా ఈ భారీ నీటితొట్టె నిర్మాణాన్ని చేపడుతోంది. 'న్యూట్రినో'లను కనుగొనడానికి ఈ తొట్టె అడుగున 40వేల ఆటమ్ డిటెక్టర్లను అమర్చనుంది. న్యూట్రినోలు పరమాణువుల కంటే సూక్ష్మాతి సూక్ష్మంగా ఉంటాయి. వీటిని గుర్తించడం చాలాకష్టం. ఇవి అంతరిక్షంలో సంచరిస్తుంటాయి. ఇతర పదార్థాలతో ప్రభావితం కాకుండా ఒక గ్రహం నుంచి మరో గ్రహానికి సులువుగా చేరుకుంటాయి. ఇవి జీవుల శరీరాల్లోనూ కోట్ల సంఖ్యలో కదలాడుతూ ఉంటాయి. న్యూట్రినోల స్వభావాన్ని కూలంకషంగా అర్థం చేసుకోగలిగితే, విశ్వం గురించి ఇప్పటివరకూ ఉన్న ఆలోచనా ధోరణిలో మార్పు రాగలదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ప్రయోగానికి ఇరవై ఒక్క దేశాలు అండదండలు అందిస్తున్నాయి. ఈ నీటితొట్టె ఎత్తు 80 మీటర్లు, వెడల్పు 70 మీటర్లు. అంటే, దీనిలో ఏకంగా ఒక బోయింగ్-747 విమానం నిలువునా పట్టేస్తుందన్నమాట. అబుదాబిలోని ప్రపంచంలోనే అత్యంత పెద్ద ఆక్వేరియం 'సీ వరల్డ్'తో పోల్చుకుంటే, జపాన్ నిర్మిస్తున్న ఈ నీటితొట్టె పరిమాణం నాలుగున్నర రెట్లు ఎక్కువ. న్యూట్రినోల పరిశీలన కోసం హిడా నగరానికి చేరువలో ఉన్న కొండను తొలిచి చేపడుతున్న ఈ నీటితొట్టె నిర్మాణం 2026 నాటికి పూర్తవుతుందని చెబుతున్నారు. న్యూట్రినోల పరిశీలన, ఇతర ప్రయోగాలను 2027 నుంచి ప్రారంభించనున్నట్లు చెబుతున్నారు.

---



# పార్టీ టేబుల్

రాత్రిపూట బర్త్‌డే వేడుకైనా, స్నేహితులతో చిన్నపార్టీ అయినా రంగుల లైట్లతో ఆ హడావుడిని తీసుకొచ్చేస్తుంటారు. కానీ అందుకు ప్రత్యేకంగా ఏలైట్లనూ అలంకరించకపోయినా అతిథుల ముందు ఉంచిన టేబుల్‌తోనే గది మొత్తాన్ని జిగేల్‌మనిపించొచ్చు.

అంతేనా, సంగీతానికి తగ్గట్టు ఆ లైట్ల అమరికనూ మార్చుకోవచ్చు. అదెలా అంటే..త్రీడీ ఇల్యూజన్ లైట్లతో వస్తున్న ఈ ఇన్ఫినిటీ కాఫీ టేబుల్‌తో. మామూలుగా ఉన్నప్పుడు సాదాగా కనిపించే ఈ టేబుల్‌ని-రిమోట్ లేదా ఫోన్లోని ఆప్‌కి కనెక్ట్ చేశామంటే...ఆకుపచ్చ, ఎరుపు, నీలం..ఇలా ఎన్నెన్నో రంగులతో అందంగా మెరిసిపోతుంది. ఈ స్మార్ట్‌యుగంలో ఇంట్లోని ప్రతి వస్తువూ సరికొత్తగా ఉండాలనుకునేవారు ఈ కాఫీ టేబుల్‌ని ఎంచుకోవచ్చు. మన అభిరుచికి తగ్గట్టు రకరకాల డిజైన్లలో ఆన్‌లైన్లో అందుబాటులో ఉన్నాయి ఇవి.



కథ

# నాడు-నేడు

గిరి పట్ల

**ఆదివారం... రాత్రి తొమ్మిది దాటింది. భోజనాలు అయ్యాక నేను, నా శ్రీమతి మా బెడ్ రూంలోకి వచ్చి మరునాడు ఉదయం మేం వెళ్లాల్సిన ఒక పెళ్లి గురించి మాట్లాడుకుంటూ ఉండగా నా దృష్టి షెల్ఫ్‌లో ఉన్న మా పెళ్లి ఫొటో ఆల్బమ్‌పై పడింది. వెంటనే దాన్ని చేతుల్లోకి తీసుకుని ఓపెన్ చేసాను. ఫొటోలను చేతితో తాకుతుంటే నా మనసు లోతులో ఒక మధురానుభూతి పుట్టింది. ఆ అనుభూతి వెంటనే మా పెళ్లి శుభ కార్యానికి ముందు మా మధ్య జరిగిన కొన్ని సంఘటనలు తలుచుకుంటూ 26 సంవత్సరాల క్రితం జ్ఞాపకాల్లోకి వెళ్లింది.**

అచ్చం నా లాగే ఆలోచిస్తూ, నా లాగే ప్రవర్తిస్తూ నాకు నచ్చిన భావాలనే తను మెచ్చుకుంటూ నా లాగే అనిపిస్తూ, నా లాగే కనిపిస్తూ కనిపించకుండా ఉంటున్న ఆ వ్యక్తి ఎవరు? తను అబ్బాయా? అమ్మాయా? అనే అనుమానం కూడా నాలో మొదలైంది.

ఓహ్.. సారీ... అసలు విషయం చెప్పలేదు కదూ. నాకు రెగ్యులర్‌గా లైబ్రరీకి వెళ్లి బుక్స్, నావల్స్ చదివే అలవాటు ఉంది. "లైబ్రరీకి వెళ్లి ఎంతో ఓపిగ్గా స్టోరీస్ చదివే నీకు దండాలు బాబు" అని ఫ్రెండ్స్ హేళన చేస్తున్నా నా అలవాటు మారలేదు.



ఇప్పుడు నేను చదువుతున్న నవల పేరు 'నిన్నే కోరుకున్న'. నాకు ఎంతో నచ్చిన ఈ నవలలో ప్రేమ ఫీలింగ్స్, ప్రేమలోని గాఢత నా గుండెలోకి చొరబడి నాలో నాకే తెలియని అందమైన భావాల మధురిమలు పుట్టించసాగాయి. అయితే నాకో అలవాటు ఉంది. నాకు నచ్చిన లైన్స్ అన్నిటికీ పెన్‌తో డైలీ అండర్ లైన్స్ చేస్తూ లైబ్రరీలో యథాస్థానంలో పెడతాను నవలని. నాకు ఇదో పిచ్చి. కొందరికి కులంపిచ్చి. కొందరికి మతం పిచ్చి. అందరికీ రాజకీయం పిచ్చి. కొందరికి సినిమా పిచ్చి. ఇంకొందరికి డబ్బుపిచ్చి. అలాగే నాకు ఈ పిచ్చి. ఎక్కడైనా మంచి ఫీలింగ్స్‌తో కూడిన కొటేషన్స్, మంచి మాటలు మనసును తట్టిలేపే భావాలు ఉంటే ఆ లైన్లు అండర్లైన్ చేయడం.

చిత్రంగా ఇదే విధంగా కొన్ని రోజులుగా నా లాగే నేను మార్కు చేసిన లైన్ల కిందనే వేరొకరు మార్క్ చేయడం గమనిస్తున్నా. కావాలనే చేస్తున్నారా? కలవరపడుతూ చేస్తున్నారా? ఎవరు? అని అనుకుంటూ ఉంటూనే ఉన్నాను ప్రతిరోజు. రోజు ఇలాగే చేస్తుంటే నా మనసు అది ఎవరో తెలుసుకోవాలని ఆరాటపడుతూనే ఉంది. అందుకే ఒక లెటర్ రాసి నేను రోజూ చదువుతున్న నవలలో నేను అండర్‌లైన్ చేసిన లైన్స్ దగ్గర పెట్టాను.

"హాయ్! నా పేరు మధు. ఈ నవల అంటే నాకు చాలా చాలా ఇష్టం. ప్రేమలోని గొప్పదనాన్ని, అందులోని అమృతాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తున్నారు రచయిత.

తను రాస్తున్న ఈ మధురమైన భావాలతో జతకట్టి నేను నిత్యం విహరిస్తున్నాను. కానీ మీరు ఎవరో నాలాగే చేస్తూ నేను ప్రేమిస్తున్న భావాలను మీరు ప్రేమిస్తున్నట్టుగా ఇక్కడ మార్కు చేస్తూ ఉన్నారు. నన్ను ఆట పటిస్తున్నారా? లేదా నిజంగా మీకు నచ్చి, మెచ్చుకుంటూ ముచ్చట పడుతున్నారా? దయచేసి తెలియచేయగలరు. ఆట పట్టిస్తూ ఎగతాళి చేయడానికి అయితే దయచేసి ఇంకొకసారి అలా చేయకండి. ఎందుకంటే ఎంతో అందమైన భావన కలిగిన ఈ ప్రేమ అన్న వాళ్లలో ఇలాంటివి చేస్తే నాకు నచ్చదు" అని రాసి పెట్టాను.

మరుసటి రోజు నేను బుక్ ఓపెన్ చేయగానే ఒక లెటర్ కనిపించింది.

ఆత్రుతతో ఓపెన్ చేసా!

"హాయ్ మధుగారు. నా పేరు మీనా. మిమ్మల్ని ఆట పట్టించడానికి కాదు. నిజంగా నాకు నచ్చే అలా మార్క్ చేశా! అని రాసి ఉంది.

వెంటనే నేను "సారీ అండీ ఎవరో కావాలనే చేస్తున్నారని అనుకున్నా. నైస్ టూ మీట్ యు" అని రాసి పెట్టాను.

మరునాడు ఇట్స్ ఒకే అని ఉంది.

నేను థాంక్స్ అని రాశా.

ఇంకోరోజు..

"నేను బిఈడి పూర్తి చేసి టీచర్ ట్రైనింగ్‌లో ఉన్నాను" అని చెప్పాను.

ఓహ్... అవునా! ఆశ్చర్యం... "నేను బీఈడీ చేస్తున్నా" అంది.

ఇది నమ్మాలో వద్దో తెలియలేదు. అచ్చం నాలాగే అచ్చు గుద్దినట్టు అనిపించింది. కానీ ఎక్కడో మూల చిన్న అనుమానం... నిజమా? కాదా? అని.

కానీ ఆ మ్యాటర్ చదవగానే నా మనసు తీన్మార్ ఆడింది.

అలా.. రెండు నెలలు రోజూ పలకరింపులు, నవల గురించి చర్చలు ఉత్తరాల ద్వారా సాగుతుండగా ఆమె మాటలు, ఆమె మనసు, ఆమె ఆలోచనలు అన్నీ కలిపి వెంట వెంటనే నా గుండెకు చేరి ఇది ప్రేమ అని అంటున్నాయి.

మనసు అంతేగా... మరీ నచ్చితే ప్రేమే అంటుంది. దానికి ప్రేమ తప్ప ఇంకేం తెలుసు?

మా ఉత్తరాల పరిచయం పరిణితి చెందింది.

ఒకరోజు అడిగాను...."మీనాగారు! ఎందుకో నా మనసు ఒక్కసారి మిమ్మల్ని చూడాలనుకుంటుంది. మీకు అభ్యంతరం లేకపోతే కలుద్దాం" అని రాశాను.

నెక్స్ట్ డే....

"అడిగిన ప్రతిదానికీ ఆన్సర్ ఇస్తుంటే చాలా చనువు తీసుకుంటున్నారు మీరు. దయచేసి ఇక ఉత్తరాలు రాయడం మానేయండి... ప్లీజ్!" అని కొట్టినట్టు రాసి పెట్టింది.


**"డాడీ...డాడీ! అంటుంటే- "మ్యాటర్ చెప్పరా! టైం లేదు" అన్నాను. "అదే డాడీ.. డైరెక్టుగా మ్యాటర్‌కే వస్తున్నా. నేనొక అమ్మాయిని లవ్ చేస్తున్నా.. వాళ్ల పెద్దలతో మాట్లాడి మా పెళ్లి చేయండి" అన్నాడు నిజంగా డైరెక్ట్‌గానే.**


తట్టుకోలేనంతగా కోపం వచ్చింది నాకు. ఏమైనా కానీ... ఐ లవ్ యు... అని రాసి పెట్టాను.

"మనిషిని చూడకుండా లవ్ ఏంటి? పిచ్చా మీకు?" అంది.

"నాకు మనిషి కన్నా మనసు మిన్న" అని చెప్పాను.

"నవల డైలాగ్ చాలా బాగుంది. నన్ను ట్రై చేయడం మానేసి నవల రాయడానికి ట్రై చెయ్.. వర్క్‌వుట్ అవుతుంది. ఆల్ ది బెస్ట్" అంది.

"నిజంగా నేను నీ మనసును చూసి ఇష్టపడ్డాను. నిజంగా నిజం.. నా ప్రేమ నిజం" అని రాసి పెట్టాను.

నెక్స్ట్.... లెటర్ లేదు.

తరువాత రోజు...???? లేదు... ఆ తరువాత రోజూ లేదు... అసలు నేను చదివే నవల కూడా కనిపించడం లేదు. నాలో బాధ... చిరాకు, కోపం... ఆలోచన అనుక్షణం ఏమీ పాలుపోవడం లేదు. లైబ్రరీకి రావడం, పోవడం చేస్తున్నా. వారం గడిచింది... నా ప్రాణం పోయేలా ఉంది. నిజంగా ప్రేమిస్తే ఇంత పెయిన్ ఉంటుందా... దేవుడా!!! అని అనిపించింది.

ఒకరోజు లైబ్రరీకి వచ్చి దిగాలుగా వెళ్తుంటే లైబ్రేరియన్‌గారు "ఇదిగో బాబూ... నిన్నే! నీ పేరు మధు కదా!" అని అడిగాడు.

"హా...సార్.." అన్నాను నిరాసక్తితో.

"మీనా అనే అమ్మాయి మెంబర్‌షిప్ తీసుకుని మీరు రెగ్యులర్‌గా చదివే నవల ఇంటికి తీసుకువెళ్లింది" అని చెప్పి "ఇదిగో! అని ఓ లెటర్ నా చేతిలో పెట్టారు.

పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్టు ఉంది. ప్రపంచంలోని సంతోషమంతా నా చుట్టే చేరినట్టు, ప్రపంచం మొత్తం నేనే ఉన్నట్టు నా కోసమే ప్రపంచం ఉన్నట్టు ఆనందం కట్టలు తెంచుకుంది ఆ లెటర్‌ని చూస్తే.

కళ్లతో చూసి కాకుండా మనసుతో చూసి ప్రేమించాను.. అన్న మీ మాటలకు నా మనసు ఫిదా అయింది. కంటిచూపు ఆగిపోయిన చోట మనసుచూపు మొదలవుతుందని ఎక్కడో చదివాను.

నిజంగా మీ ప్రేమ నిజమే అయితే మీ అమ్మా నాన్నలని తీసుకుని మా ఇంటికి వచ్చి, మా అమ్మా నాన్నలతో మాట్లాడండి మన పెళ్లి గురించి. ఇది మా అడ్రస్ అని రాసి ఉంది.

మ్యాటర్ చదివిన నాకు ఎక్కింది చూడు కిక్కు. నిజంగా చెప్పాలంటే ప్రేమలో ఉన్న కిక్కు ప్రపంచంలో ఇంకెక్కడా ఉండదు.

వెనువెంటనే పెళ్లిచూపులు, తన మనసుకే కాదు కళ్లకు నచ్చింది, వంక పెట్టలేని ఆనందం. అందరూ సీతతో పోల్చారు. కొద్ది రోజుల్లోనే ఉద్యోగం, పెళ్లి. ఇలా ఒకదాని వెనక ఒకటి చక చకా జరిగిపోయాయి.

"ఆల్బమ్ చూడ్డం అయిందా? అయితే వచ్చి పడుకోండి" అంది నా శ్రీమతి.

శ్రీమతి మాటలతో గతంలో నుంచి వర్తమానంలోకి జారిపడ్డాను.

...........

మరునాడు ఉదయం "పెళ్లికి వెళదాం" అని రెడీ అవుతుంటే పాతికేళ్ల నా సాఫ్ట్‌వేర్ కొడుకు మా ముందుకు వచ్చి "డాడీ...డాడీ! అంటుంటే "మ్యాటర్ చెప్పరా! టైం లేదు" అన్నాను.

"అదే డాడీ డైరెక్టుగా మ్యాటర్‌కే వస్తున్నా. నేనొక అమ్మాయిని లవ్ చేస్తున్నా.. వాళ్ల పెద్దలతో మాట్లాడి మా పెళ్లి చేయండి" అన్నాడు నిజంగా డైరెక్ట్‌గానే.

డైరెక్ట్ అంటే మరీ ఇంత డైరెక్ట్‌గానా అనుకుని.. "నీతో ఆఫీసులో పని చేస్తుందా?" అని అడిగా.

"నో..." అన్నాడు.

"కాలేజ్ లవ్వా అన్నా.."

"నో.." అన్నాడు.

"....మరి.... ఇంకెలారా..?" అన్నాను.

"టూ మంత్స్ బ్యాక్ నా వాట్సాప్‌కి ఒక కొత్త నెంబర్ నుండి మెసేజ్ వచ్చింది. ఒక మంచి రొమాంటిక్ నవల అది. అసలు చదివే అలవాటు లేని నాకు ఒకరోజు బోర్ కొట్టి టైం పాస్ కోసం జస్ట్ ఓపెన్ చేశా.. అంతే!

అందులో అన్నీ నాకు నచ్చినట్టే నేను ఫీల్ అయ్యే ఫీలింగ్స్ ఉన్నాయి. ఆ నావెల్ కేవలం నా కోసమే రాశారా! అనిపించేలా ఉంది. నా ఫీలింగ్స్ కలర్ జిరాక్స్‌లో కనిపించాయి.

అందుకే అది పంపించినందుకు వాళ్లకి థాంక్స్ చెప్పాలని అంతే....

అలా...అలా...పరిచయం... ఆ తరువాత చాటింగ్.. మీటింగ్... కాల్స్.. మాల్స్... మీల్స్...

పిక్ అప్‌లు.. డ్రాపింగ్‌లు.. అలా... లవ్. ఇప్పుడు ఇలా.... మీ ముందుకు వచ్చింది" అన్నాడు చాలా గర్వంగా.

వాడి మాటలకు నా వైఫ్ నన్ను ఒక చూపు చూసింది "బుద్ధులు ఎక్కడికి పోతాయ్!" అన్నట్టుగా.

నవ్వొచ్చింది నాకు. వాడు మాకు షాక్ ఇచ్చాడా? నా వారసత్వాన్ని కొనసాగించాడా? అన్నట్టుగా.

కాలం మారింది. కాన్సెప్ట్‌లు మారాయి. పరిచయాలు మారాయి...

కానీ ప్రేమ మారలేదు. ప్రేమ ప్రేమే అనుకున్నా. కాస్త గ్యాప్‌లో భార్య నవ్వింది.... మా ఇద్దరిని చూసి మా వాడు నవ్వాడు.

# లక్ష్యానికి చేరువలో..

సూరిశెట్టి వసంతకుమార్

అనుకున్నది సాధించాలన్న కోరిక, పట్టుదల అందరికీ ఉంటుంది కానీ కొంతమంది వల్లే అనుకున్నది సాధించడం జరుగుతుంది. మరికొంతమంది ప్రారంభంలోనే ఏదో ఒక కారణంతో అలాగే వుండిపోతున్నారు. ఎంతో మంది స్త్రీలు సాధించడానికి భయపడే పనిని ఆత్మస్థైర్యంతో ఎవరూ ఊహించని గొప్ప సాధనని సాధించి చూపింది. ఆమె ఎవరో కాదు.. కల్పనా ఛావల్. అంతరిక్షానికి వెళ్లిన మొట్టమొదటి భారతనారి.

పరిస్థితులు ప్రతికూలంగా వున్నప్పుడు సుధా నారాయణమూర్తి సరైన నిర్ణయాల్ని తీసుకుని దారి చూపడం వల్ల ఆమె భర్త నారాయణమూర్తి ఇన్ఫోసిస్ సంస్థని స్థాపించి ప్రపంచ ఖ్యాతి గడించారన్న సంగతి అందరికీ తెలుసు. ఇంకా ఇందిరాగాంధీ, జయలలిత, ఐశ్వర్యారాయ్, సింధు, పి.టి.ఉషా, మిథేలీరాజ్... ఇలా ఎందరో పరిస్థితుల్ని తట్టుకుని పెద్ద ఎత్తుకు ఎదిగి మనకీ, మన దేశానికీ పేరు ప్రఖ్యాతులు తీసుకుని వచ్చారు. సాధించడానికి అవకాశం లేక, దారి తెలియక వున్నవారికి ఈ కింది విషయాలు దారి చూపిస్తుందేమో చూద్దాం!

**మొదటిది..** ఎప్పుడూ సానుకూల దృక్పథంలో ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. దీనివల్ల అపజయాల్ని కూడా విజయాలుగా మార్చుకోవడానికి అవకాశం ఉంటుంది. మళ్లీ మళ్లీ అనుకున్నది సాధించడానికి మందులా పని చేస్తుంది. గజనీ మొహమ్మద్ ఇరవై ఏడు సార్లు ఓడిపోయిన తర్వాతే గెలిచాడు. అబ్రహాం లింకన్ కూడా ఎన్నో ఓటములు, ఎన్నో అవమానాల తర్వాతే అమెరికా వైస్ ప్రెసిడెంట్ అయ్యాడు. సానుకూల దృక్పథం సాధించాలన్న సంకల్పం వుంటే ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొని నిలబడ్డ ఎందరో మహిళల్ని మనం చూసాం.



**రెండవది..** సరైన అవగాహన, సాధిస్తామన్న నమ్మకం వున్నప్పుడు దేనినైనా సులభంగా సాధించవచ్చు. అలా కాకుండా వాళ్లూ, వీళ్లూ చెప్పిన మాటలు విని, వాళ్లు చెప్పినట్టు చేసి నష్టమొచ్చినప్పుడు అయ్యో! ఇలాగైపోయిందేమిటి? అని ఆలోచించకుండా ముందే మనం చేసే పనిలో కష్టనష్టాల గురించి బాగా ఆలోచించి- ఒకవేళ నష్టం వస్తే ఎలా తట్టుకుని మళ్లీ ఎలా నిలబడాలో ఆలోచిస్తే ఓటమి మీ దరిదాపులకి రాదు.

**మూడవది..** కుటుంబ సభ్యుల ప్రోత్సాహం వుంటే అనుకున్నది అనుకున్నట్టు సాధించగలుగుతారు ఆడవాళ్లు. అలాగే తమ విజయానికి చాలామంది చెప్పినట్లు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఒక్కటే కారణం అన్నది నిజం కాదు. సాధించాలన్న పట్టుదల, మనోధైర్యం కూడా కావాలి. అలాగే ఎలాంటి సమస్య వచ్చినా దాన్ని మీరే సరిచుసుకునే మనోబలం కూడా వుండాలి.

**నాలుగవది..** నిజాయితీగా వుండండి. నిజాయితీ అన్నది చాలా చాలా ముఖ్యం. చేసే పనిలో ఎదుటివారి నమ్మకాన్నీ, ప్రోత్సాహాన్నీ పొందినప్పుడు కచ్చితంగా మంచి పొజిషన్‌కి వెళ్లడం సాధ్యమే. మీలో పని చేసే సహ ఉద్యోగులతో సామరస్యంగా వుండడం, వారితో కలివిడిగా మాట్లాడుతూ స్నేహభావంతో వుంటూ ఎటువంటి విమర్శలకీ తావివ్వకుండా వుంటే మీ లక్ష్యం సాధించడానికి మార్గం సులభతరం అవుతుంది.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య చెప్పినట్టు నువ్వు రోడ్లు ఊడ్చే పనిలో వున్నప్పుడు రోడ్లని ప్రపంచంలో నీ కన్నా ఎవరూ గొప్పగా ఊడ్చలేరని నిరూపించుకున్నప్పుడు నీ గురించీ, నీ పనితనం గురించీ అందరికి తెలుస్తుంది. చేసే పని ఏదైనా సరే... అందులో నూరు శాతం శ్రమించినప్పుడు ఎంత గొప్ప పనైనా సులభంగా సాధించడానికి వీలవుతుందన్నది నిజం.

**ఐదవది..** సాధించాలన్న కోరిక వున్నవాళ్లు తమ మీద వస్తున్న విమర్శల్ని పట్టించుకోకూడదు.



ప్రపంచంలో విమర్శించని ఊరు, విమర్శించని నోరు ఉండవు. వాటిని పట్టించుకోకుండా మన లక్ష్యం వైపు అడుగులు వేస్తే ఏదో ఒకరోజు విజయం మన సొంతమవుతుంది. అప్పుడు విమర్శించిన నోళ్లే "నాకెప్పుడో తెలుసు నువ్వు సాధిస్తావని" అని అనడం మనం చూస్తాం.

**ఆరవది..** అన్నింటికన్నా ముఖ్యమైనది ఆత్మవిశ్వాసం. మనలో వున్న ప్లస్, మైనస్ పాయింట్లను తెలుసుకుని దానికి తగినట్టుగా ముందుకి వెళ్తే చాలా సులభంగా మన లక్ష్యాన్ని సాధించగలం. ఒకేసారి రెండు మూడు పనులను చెయ్యవద్దు. ఇలా చెయ్యడం వల్ల దేనిలోనూ పరిపూర్ణత సాధించలేం. మీ లక్ష్యం ఏదైతో ఉందో ఆ ఒక్కదాని మీదే కేంద్రీకరించి వున్నప్పుడు దేనినైనా సాధించడం తేలిక అవుతుంది.

అందువల్ల ఆడవాళ్లూ... కలలు కనండి. ఆ కలలని సాధించడానికి నిజాయితీగా కృషి చెయ్యండి. మీరూ ఒకరోజు మీ లక్ష్యాన్ని సాధించి అందరిలోనూ ప్రత్యేకంగా నిలబడతారు. ✦

మారు ఇద్దరు రచయితల గురించి ఓ నాలుగు మాటలు... ఈ వారిద్దరిదీ మాతృభాష తెలుగే అయినప్పటికీ తమిళంలో రచనలు చేసి సుప్రసిద్ధులయ్యారు. వారిలో ముందుగా తిరులోక సీతారాం గురించి తెలుసుకుందాం. ఈయన మాతృభాష తెలుగు. కానీ పరిస్థితుల ప్రభావంతో ఆయన అనేక రచనలు చేసి తమిళ సాహితీవనంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంతరించుకున్నారు.

యామిజాల జగదీశ్




# 'తమిళ' రచనల సేవలో..

ఇటీవల ఎస్.రామకృష్ణన్ అనే తమిళ రచయిత తిరులోక సీతారాం గురించి చెప్తూ ఆయన మాతృభాష తెలుగు అని చెప్పడంతో సీతారాం విషయాలు ఒకటి రెండు పంచుకోవాలనిపించింది.

## తిరులోక సీతారాం

తిరులోక సీతారాం తమిళనాడులోని పెరంబలూరుకి సమీపంలో ఉన్న తొండైమాందురై అనే ఊళ్లో తిరువయ్యారు లోకనాథ అయ్యరు, మీనాక్షి సుందరమ్మాళ్ దంపతులకు 1917 ఏప్రిల్ ఒకటో తేదీన జన్మించారు. 1973 ఆగస్టులో తుది శ్వాస విడిచారు. ఆయన తమిళ కవిగా, చిన్న కథల రచయితగా, అనువాదకుడిగా, పత్రికా రచయితగా పేరు గడించారు. ఆయన తల్లిదండ్రులు ఇంట్లో తెలుగులోనే మాట్లాడుకునేవారు.

మూడవ యేట తండ్రిని పోగొట్టుకున్న సీతారాం మేనమామ ఇంట పెరిగారు. ఆయనకు లలిత అనే సోదరి, మరొక సోదరుడు ఉన్నారు.


ఆయనకు 1936లో 19వ యేట పదేళ్ల రాజమణితో వివాహమైంది. వీరికి మధురం, వసంత, ఇందిర అనే ముగ్గురు కుమార్తెలు; పశుపతి, సుబ్రమణియన్, మురళీధరన్, రామకృష్ణన్ అనే నలుగురు కుమారులు.

చిన్నతనంలోనే కవిత్వం పట్ల ఆసక్తి చూపిన సీతారాం 18వ యేట ఇందియ వాలిబన్ (ఇండియన్ యూత్) అనే తమిళ పత్రికను ప్రారంభించారు.

తరువాత, విల్లుపురం సమీపంలోని పరిక్కల్ అనే చిన్న పట్టణంలో రామా సదాగోపాల్ నడుపుతున్న 'త్యాగి' అనే పత్రికకు కొన్ని నెలలు సహాయ సంపాదకుడిగా పనిచేశారు.

"మందహాసన్" అనే కలంపేరుతో రాయడం ప్రారంభించి కొన్నాళ్ల తర్వాత త్రిలోకం సీతారాం పేరుతో రచనలు కొనసాగించారు.

'సాహిత్య పడవ' వ్యాస సంపుటి, 'శివాజీ' పత్రికా సంపుటం, 'సిద్ధార్థన్' అనువాదం తమిళం ఉన్నంత కాలం త్రిలోక సీతారాం అనే పేరు ఉంటుంది.



తిరువయ్యారు లోకనాథ సీతారాం అలియాస్ త్రిలోక సీతారాం తమిళ జాతీయ కవి

సుబ్రమణ్య భారతియార్ని ప్రత్యక్షంగా చూడకపోయినప్పటికీ ఆయన రచనలంటే ప్రాణం. భారతియార్ కవిత్వం గురించి చెప్తుండేవారు. ఎక్కడికి వెళ్లినా భారతియార్ పాటలకు బాణీలు కట్టి పాడుతుండేవారు.

దాదాపుగా ఆయన పాటలన్నీ సీతారాంకు కంఠస్థమే. భారతియార్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలున్న సీతారాంకు భారతియార్ శిష్యుడైన భారతిదాసన్ అంటే మహా ఇష్టం. వీరి మధ్య మంచి స్నేహముండేది.

అలాగే తమిళనాడు రాజకీయ నాయకులలో ఒకరైన కామరాజర్‌కు త్రిలోక సీతారాం అంటే అభిమానం. 1961 జులై 29వ తేదీన తిరుచ్చి టౌన్ హాలులో శివాజీ వారపత్రిక రజతోత్సవ సంచికను ఆవిష్కరించిన సభలో కామరాజర్ మాట్లాడుతూ త్రిలోక సీతారాం కవితల మీదా, శివాజీ పత్రిక మీదున్న అభిమానంతో ఆయనను తమిళనాడు ప్రభుత్వ ఆస్థాన కవిగా నియమిస్తానని కొందరితో చెప్పారు కూడా. కానీ కొన్ని రాజకీయ కారణాల వల్ల అది నెరవేరలేదు.

ఓసారి డిఎంకె పార్టీ వ్యవస్థాపకుడు అన్నాదురై త్రిలోక సీతారాం గురించి మాట్లాడుతూ అగ్రహారంలో పుట్టిన అపూర్వ మనిషి సీతారాం అని అభివర్ణించారు.

అలాగే తన పత్రిక ద్రావిడనాడు భారతిదాసన్ కోసం వెలువరించిన ప్రత్యేక సంచికకు ఓ గేయం రాసివ్వమని సీతారాంను కోరారు అన్నాదురై. అందుకు పారితోషికమూ ఇచ్చారు.

పారిశ్రామికవేత్త జి.డి.నాయుడుతోనూ ఆయనకు సత్సంబంధాలుండేవి. ఆయనను కోయంబత్తూరుకు పిలిపించి అనేక సార్లు సభలలో మాట్లాడించారు జి.డి.నాయుడు.

పద్దెనిమిదో యేట కలం పట్టిన ఆయన కడదాకా రచనలు చేస్తూ 1973 ఆగస్టు 23న మరణించారు.

ఆయనకు నివాళులర్పిస్తూ ప్రముఖ రచయిత జయకాంతన్ "త్రిలోక సీతారాం ఇక్కడ సంచరించే సిద్ధపురుషులలో ఒకరు. ఆయన రచనలు మనకో భాగ్యం. ఆయన ఎటూ పోలేదు. అస్తమించి మళ్లీ ఉదయించే సూర్యుడిలాంటివారే సీతారాం. ఆయన రచనలు భవిష్యత్ తరాల వారికీ ఓ వెలుగు రేఖలే" అని గుర్తు చేశారు.

## వాణిదాసన్

ఇక రెండవ రచయిత వాణిదాసన్. ఈయన మాతృభాష కూడా తెలుగే. కానీ పుట్టి పెరిగిందంతా తమిళనాడు. తమిళ సాహిత్యంలో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న రచయితలలో ఈయనొకరు.

ఇరవయ్యో శతాబ్దపు కవిగా వినుతికెక్కిన వాణిదాసన్ 1915 జులై 22న తిరుక్కాము, తులసి అమ్మాళ్ దంపతులకు పుదుచ్చేరి సమీపంలో ఉన్న విలియనూర్‌లో జన్మించారు. ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు రంగసామి. ఆయన ముద్దు పేరు రామి.

ఆయనకు తల్లిదండ్రులు పెట్టిన పేరు రంగసామి. ఆయన ముద్దు పేరు రామి. తన ఏడో యేట తల్లిని కోల్పోయారు. మాతృభాష తెలుగుతో పాటు తమిళం, ఇంగ్లీషు, ఫ్రెంచ్ భాషలలో దిట్ట.



1935లో వాణిదాసన్ తన పినతల్లి మేనకోడలు ఆదిలక్ష్మిని వివాహం చేసుకున్నారు. రెండేళ్ల పాటు అరుగుమీది చదువుతో అక్షర జ్ఞానం పొందిన వాణిదాసన్ అనంతరం విల్లియనూర్ స్కూల్లో చదువు కొనసాగించారు. అక్కడ భారతిదాసన్, ఎల్లప్ప, ముత్తుకుమారస్వామి పిళ్ళై వంటి మాస్టార్ల దగ్గర చదువుకున్నారు. స్కూల్ ఫైనల్లో పుదువైలో ఫస్ట్ ర్యాంక్ సంపాదించారు.

వాణిదాసన్ 1937 నుంచి 34 సంవత్సరాల పాటు తమిళ ఉపాధ్యాయులుగా పనిచేశారు.

తమిళ భాష మీద ప్రేమతో కవితలు రాయడం మొదలుపెట్టారు. తొలి రోజుల్లో "రా-మి" అనే కలం పేరుతో రాశారు.

ఫ్రెంచ్ అధ్యక్షుడి నుండి షెవాలియర్ గౌరవాన్ని అందుకున్న వాణిదాసన్ రాసిన కవితలు పదిహేడు సంకలనాలుగా వెలువడ్డాయి.

తమిళ జాతీయ కవి సుబ్రమణ్యభారతి స్మారక దినోత్సవం పురస్కరించుకుని ఈయన రాసిన "భారతి నాళ్ ఇంద్రడా.." అని ఆయన రాసిన కవితలలో మొట్టమొదటిది. ఈ కవిత "తమిళన్" అనే దినపత్రికలో అచ్చయింది. ఈయన కవితలను తరచూ ప్రచురించి ప్రోత్సహించిన తమిళన్ పత్రిక సంపాదకుడే ఈయనకు "వాణిదాసన్" అనే పేరు పెట్టారు.

భారతిదాసన్‌తో సన్నిహిత సంబంధాలున్న వాణిదాసన్ 1945లో చెన్నైలో విద్వాన్ పట్టా పొంది పుదుచ్చేరికి వెళ్లి కల్వే కళాశాలలో లెక్చరర్‌గా చేరారు.

పొన్ని, కాదల్, మురసొలి, ముత్తారం, మండ్రం, తెండ్రల్ తదితర పత్రికలలో ఈయన రచనలు వెలువడ్డాయి.

ఫ్రాన్స్ దేశం ఈయనకు షెవాలియర్ అవార్డుతో సత్కరించింది. ఈయన రాసిన "విదవైక్కొరు సెయిది" (విధవరాలికి ఓ వర్తమానం) కవిత ద్రవిడనాడు అనే పత్రికలో అచ్చయింది. ఈ పత్రిక సంపాదకులు అన్నాదురై. ఈ కవితకు విశేష ఆదరణ లభించింది.

కవితలు, గేయాలే కాక కావ్యాలు కూడా రాసిన వాణిదాసన్ తమిళచ్చి కొడిముల్లయ్ కావ్యం మంచి పేరు తెచ్చి పెట్టింది.

ఈయన రాసిన పాటల పుస్తకం "తొడువాన్" కి సుప్రసిద్ధ రచయిత తిరు.వి.కా పీఠిక రాశారు.

1956లో ఈయన కవితా సంకలనం వాణిదాసన్ కవితలు పేరుతో వెలువడింది. ఇందులో మొత్తం 88 కవితలున్నాయి. ప్రకృతి, ఆనందం, ప్రజలు, విప్లవం, తమిళం, పూలవనం, సంగీతం అనే అధ్యాయాలుగా ఈయన కవితలు రాశారు.

ప్రత్యేకించి ప్రతి ఏటా పొంగల్ పండుగ సందర్భంలో ఈయనతో గేయాలు రాయించుకున్న పత్రికలుండేవి. అవన్నీ కలిపి "పొంగల్ పరిశు" (పొంగల్ కానుక) అనే పుస్తకంగా పాఠకలోకం ముందుకొచ్చింది.

"తమిళం-ఫ్రెంచ్ కయ్యగర ముదలి, తీర్థ యాత్తిరై, ఇన్ప ఇలక్కియం, ఎయిలోవియం, కుయందై ఇలక్కియం, పెరియ ఇడత్తు సెయిది, సిరిత్త. నునా, ఇరవు వరవిల్లయ్ వంటి అనేక పుస్తకాలు రాశారు వాణిదాసన్.

అనేక వేదికలపై ఈయన పాడిన పాటలు 'పాట్టరంగ పాడల్గళ్' అనే శీర్షికతో పుస్తకంగా వెలువడింది. ప్రకృతిని వర్ణిస్తూ ఆయన రాసిన పాటలు అత్యద్భుతం. అందుకే ఆయనను "వర్డ్స్‌వర్త్ ఆఫ్ తమిళనాడు", "కవిఞ్జరేరు", "పావలర్‌మణి", "పుదువై కవిఞ్జర్", "తమిళనాడు ఠాగూర్" వంటి అనేక బిరుదులు పొందిన వాణిదాసన్ కవితలు ఉర్దూ, ఇంగ్లిషు తదితర భాషలలో అనువదించబడ్డాయి. తమిళనాడు ప్రభుత్వం ఈయన పుస్తకాలను స్వీకరించి విశేష ప్రచారం చేసింది.

పుదువై ప్రభుత్వం ఈయన ఉండిన సేలియమేడులో ఉన్న ఉన్నత పాఠశాలకు వాణిదాసన్ పేరు పెట్టింది.

చివరి వరకూ సాహితీసేవ చేస్తూ వచ్చిన వాణిదాసన్ తన 59వ యేట 1974లో ఆగస్టు ఏడున మరణించారు.

## జోక్స్ కార్నర్

### దానం విలువ

దానం విలువ గురించి టీచర్ పిల్లలకు బోధిస్తోంది.

టీచర్: అన్ని దానాలలోకెల్లా అన్నదానం మిన్న.

రాము: నాకు అన్న లేదు, తమ్ముడు వున్నాడు. తమ్ముడ్ని దానం చేయవచ్చా టీచర్?

శ్యాము: నాకు ఒక్క అన్న మాత్రమే ఉన్నాడు. ఉన్న ఒక్క అన్నని దానం ఏస్తే నా పరిస్థితి ఏమిటి టీచర్?

సోము: నాకు అన్న లేదు, తమ్ముడు లేదు. మరి నేను ఎవర్ని దానం చేయాలి టీచర్?

టీచర్: ....!?

### ఎందుకివ్వాలి?

తల్లి: ఆయనతో జాగ్రత్త. ఆయన ఆవులిస్తే పేగులు లెక్క పెడ్తాడు.

చింటు: ఖరీదైన ఆవులు ఆయనకి ఎందుకు ఇవ్వాలి? ఆయనతో పేగులు ఎందుకు లెక్క పెట్టించుకోవాలి? నేను ఆవులు ఇవ్వను, పేగులు లెక్క పెట్టించుకోనమ్మా!

బంటు: గేదెలు మాత్రం తక్కువ రేటున్నాయా? నేను ఒక్క గేదె కూడా ఇవ్వనమ్మా!

తల్లి: ...!!??

**- మా శ్రీ.రాజు,** పాల్వంచ

# చినుకు..చినుకు

ఆర్.సి.కృష్ణస్వామిరాజు

సింగిల్ పేజీ కథ

బెంగళూరులోని కొడుకు కుమారస్వామిని చూద్దామని బస్సెక్కాడు పుట్టన్న. "సిటీలోని హెబ్బాల్ రోడ్డులో కొత్త ఫ్లాట్ కొన్నాడు. గృహప్రవేశానికి పిలిచినా పొలం పనులవల్ల వెళ్లలేకపోయాను. ఇప్పుడు తీరిక దొరికింది. కొత్త కోడలు, కొత్త కాపురం.. ఎలా వున్నారో" అనుకుంటూ ఫ్లాట్ వద్దకి చేరాడు.

పదిహేను అంతస్తుల అపార్ట్‌మెంట్ అది. దాని ముందర నిలబడి తల ఎత్తి పైకి చూశాడు. ఆకాశాన్ని అందుకున్నట్లుగా ఉంది.. రంగు రంగుల భవనం.

"ఎంత ఎదిగినాడు నా కొడుకు!" అని గర్వపడినాడు.

అంతా మాయగా ఉన్న ఆ అపార్ట్‌మెంట్‌లో ఎలాగోలా కొడుకు ఫ్లాట్ పట్టేసాడు.

కాలింగ్ బెల్ కొట్టాడు. కొత్తకోడలు సినీ నటి కాంచనమాలలా ముసిముసి నవ్వులు నవ్వుతూ వచ్చి తలుపు తీసింది. సోఫాలో కూర్చోబెట్టి చల్లటి నీళ్ల చేతికిచ్చింది.

నోట్లోకి నీళ్ల పోసుకుంటూ ఉంటే తెరలు తెరలుగా చల్లటి చిరుగాలులు ముఖానికి తగిలాయి. "ఈ చల్లగాలికే కదా జనాలు ఫిదా అయ్యేది. ఎక్కడెక్కడివారో వచ్చి ఈ బెంగళూరులో స్థిరపడేది" అనుకున్నాడు. కానీ ఏదో తేడాగా అనిపించి గోడకేసి చూశాడు. 'బ్లూ స్టార్ ఏసి' నుంచి వస్తున్న చల్లగాలి అది.

"ఈసారి బెంగళూరులో ఎప్పుడూ లేని ఎండ కాస్తోంది. అందుకే ఏసి పెట్టుకున్నాం" అని ముద్దు ముద్దుగా చెప్పింది కొత్త కోడలు.

"ఎండాకాలంలో చల్లగా ఉంటుందని సత్యసాయిబాబా పుట్టపర్తి నుంచి బెంగళూరు వైట్ ఫీల్డ్స్‌కి వచ్చేవారని విన్నాం. అట్లాంటిది ఇక్కడ కూడా ఏసి పెట్టుకోక తప్పట్లేదు" అని మనసులో నవ్వుకున్నాడు.

"అబ్బాయి ఎక్కడని?" అడిగాడు.

"అపార్ట్‌మెంట్ పైన ఉండే పెంట్ హౌస్ వద్ద ఉన్నాడని" చెప్పింది. "ఇంత పొద్దున్నే పెంట్ హౌస్ దగ్గర ఏమి పని?" అని అనుకుంటూ ఉండగా కోడలే ఇలా చెప్పింది.

ఆయన ఇప్పుడు ఈ అపార్ట్‌మెంట్‌కి ప్రెసిడెంట్. ఆ విషయాలు చూడటానికే అక్కడికి వెళ్లారు" అని చెప్పింది.

"పులి కడుపున పులే పుడుతుంది. అందుకే అందరూ చేరి నా కొడుకును ప్రెసిడెంట్ చేసి ఉంటారు. మేధావులు, కోట్లకు పడగలెత్తినవారు ఉన్న ఈ అపార్ట్‌మెంట్‌కి నాయకత్వం అంటే మాటలా?" అని సంబరపడిపోయాడు పుట్టన్న. మనసులోనే తన భుజం తాను తట్టుకున్నాడు.



కొడుకుని ప్రెసిడెంట్ హోదాలో చూస్తే బాగుంటుందని లిఫ్ట్ ఎక్కి పెంట్ హౌస్ వద్దకి వెళ్లాడు.

అక్కడ ఎవ్వరూ లేరు. కొడుకు కుమారస్వామి కూడా ఎక్కడా కనిపించలేదు. బాగా వెదికితే ఒక కుర్రవాడు పెంట్ హౌస్ పైన నిలబడి కళ్లకు అరచేయి అడ్డం పెట్టుకుని ఆకాశం వైపు చూస్తున్నాడు.

ప్రతిరోజూ పొలానికి పోయే ముందు చద్దన్నం తింటూ "ఒరేయ్ కుమారస్వామీ, ఆకాశంలోకి చూసిరారా! మబ్బులేమైనా ఉన్నాయేమో.. వానలేమైనా కురుస్తాయేమో" అని అడిగేవాన్ని.

"నీకింకేం పనిలేదు... రోజూ వానగొడవే!" అని కుమారస్వామిని విసుక్కుంటూ ఇంటి బయటికి వెళ్లి మబ్బులున్నదీ లేనిదీ చెప్పేవాడు. అది గుర్తుకొచ్చి చిన్నగా నవ్వుకున్నాడు పుట్టన్న.

"ఎప్పుడొచ్చావు నాన్నా?" అని పిలిచాడు కుమారస్వామి.

"ఎక్కడి నుంచి పిలుస్తున్నాడా?" అని చూస్తే "ఆ పెంట్ హౌస్ పైన నిలబడి ఆకాశం వైపు చూసి వస్తున్నది తన కొడుకే" అని తెలుసుకుని ఆశ్చర్యపోయాడు.

"నా చిన్నతనంలో నువ్వు రోజూ ఆకాశంవైపు చూడమంటే చాలా అసౌకర్యంగా ఉండేది నాకు. ఇప్పుడు లక్షల జీతం తీసుకుంటున్నాను. కోటి ఖరీదు చేసే ఫ్లాట్ కొన్నాను. అయినా ప్రస్తుతం... వానచినుకు కోసం రోజూ ఆకాశంవైపు చూసే పరిస్థితి నాది. ఈ ఏడాది వర్షాలు సరిగా పడలేదు. నీటి కటకటతో బెంగళూరులో బెంగ మొదలైంది. కార్లను నీళ్లతో కడుక్కోలేని పరిస్థితి. లక్షలు ఖర్చు పెట్టి ఇంత పెద్ద అపార్ట్‌మెంట్‌కి ట్యాంకుల్లో నీళ్ల తెప్పిస్తున్నాం. అయినా నీళ్ల అందరికీ సరిపోవడం లేదు. రోజూ నీళ్లకోసం అపార్ట్‌మెంట్‌లో గొడవలే. చుక్క చినుకు కోసం ఎంత ఆరాటపడుతున్నామో.." అని పుట్టన్నతో బాధగా చెప్పాడు.

"పల్లెటూరివాసులైనా, పట్టణవాసులైనా ప్రకృతిని విస్మరిస్తే ప్రకృతి కూడా మనల్ని విస్మరిస్తుంది. మనం పర్యావరణాన్ని రక్షించుకోకపోతే మనల్ని రక్షించేవాళ్లు ఎవ్వరూ ఉండరు" అన్న పుట్టన్న మనసు బాధగా మూల్గింది.

అక్కడి నుంచి చిన్నగా కదిలారు తండ్రీ కొడుకులిద్దరూ.

# త్యాగాల ప్రతీక బక్రీద్

ఎస్.రహంతుల్లా

ముస్లింలు ఆచరించే ఐదు సూత్రాల్లో అర్హత, ఆర్థిక స్థోమత కల్గిన వారు ఆచరించాల్సినది 'హజ్'. ఈ హజ్ సందర్భంగా ఆచరించే నమాజును ఈదుల్ అజహ్ అంటారు. ప్రపంచ దేశాల్లోని ప్రాంతాల నుంచి లక్షలాది మంది హజ్ యాత్రకు వెళతారు. హజ్‌యాత్ర సందర్భంగా ముస్లింలు నియమ నిష్టలతో నలభై రోజుల పాటు దైవ మార్గంలో గడుపుతారు. ఈదుల్ అజహ్ ప్రార్థనలను మక్కాలో ఆచరిస్తారు.



దీనికి అరబ్ దేశాలు విస్తృత ఏర్పాట్లు చేస్తుంది. ఈ ఏడాది హజ్ యాత్రికుల కోసం అక్కడి ప్రభుత్వం మక్కా, మదీనాలో భారీ ఎత్తున సదుపాయాలు కల్పించారు. ఇప్పటికే భారతదేశం నుంచి లక్షలాది మంది హజ్ యాత్రకు చేరుకున్నారు. హజ్ యాత్ర చేయటం అనేది అల్లాహ్ ఇచ్చిన వరంగా భావించవచ్చు.

పూర్వం హజ్ యాత్ర సముద్రయానం ద్వారా మూడు నెలల పాటు యాత్ర సాగేది. నేడు ఆకాశయానం అందుబాటులోకి వచ్చింది. హజ్ యాత్ర సందర్భంగా మదీనాలోని విమానాశ్రయాన్ని తెరచి ప్రపంచ దేశాల నుంచి వచ్చే విమానాలకు అనుమతిస్తారు.

సత్యసంధతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిన ఇబ్రహీం ఖలీలుల్లా దగ్గరుండి అల్లాహ్ ఆదేశాలతో నిర్మించిన కాబేతుల్లా (మక్కా) దర్శనం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తారు.

## హజ్ యాత్ర ఖుర్బానీ ప్రాధాన్యత


ముస్లిం సోదరులు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండగల్లో రెండు ప్రధానమైనవి. ఇందులో ముప్పై రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి జరుపుకునే పండగను రంజాన్ అంటారు. ఇస్లాం మత వ్యాప్తి కోసం దేవుని ఆజ్ఞ కోసం తన కన్నబిడ్డను సైతం తన చేతులతో బలి (ఖుర్బానీ) ఇచ్చిన రోజూ బక్రీద్ అంటారు.

మానవుడు ఆచరించాల్సి న నాలుగు ధర్మాలను పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించగా ఐదవది అయిన హజ్ సందర్శనం బక్రీద్‌లో ఆచరిస్తారు. 'బక్రీ' అంటే మేక అని ఈద్ అంటే 'పండగ' అని అర్థం. బక్రీద్ అంటే దైవాజ్ఞను పాటించే భక్తులు దేన్నైనా సమర్పిస్తారు (ఖుర్బానీ) అనటానికి నిదర్శనంగా చెప్పవచ్చు. మానవుని సృష్టించిన దేవుడు ప్రపంచంలో అన్ని విధాల సదుపాయాల్ని కల్పించి వాటిని అనుభవిస్తూ తనను ధ్యానం చేయమని ఆదేశించాడు. ఈ ఆదేశాలను ఆచరించిన ప్రవక్తల జీవితాలను భావి తరాలకు అందించేందుకు పవిత్ర ఖుర్ ఆన్‌లో పలు సంఘటనలను పొందుపరచారు. అలాగే హదీసుల్లో వివరించారు. బక్రీద్ ప్రాధాన్యతకు సంబంధించి ఖురాన్‌లోని అల్ తౌబా 24లో పేర్కొన్నారు.

ఇబ్రహీం సొలైఅలా అలాహోసొల్లాం భగవంతుని ఆజ్ఞతో తన కన్న బిడ్డను బలి ఇవ్వటం గమనిస్తే 'త్యాగనిరతి'కి నిదర్శనంగా చెప్పవచ్చు, ఈ పండగ సందర్భంగా జరిపే ప్రార్థనలను 'ఈదుల్ ఆజహ్' అని చెబుతారు. పండగలంటే కొత్త బట్టలు ధరించటం, సంతోషంగా గడపడమే కాదు. అన్ని జన్మల్లోకెల్లా అత్యుత్తమమైన మానవ జన్మను ప్రసాదించిన భగవంతునికి కృతజ్ఞతలు తెల్పుకుంటూ, భక్తి ప్రవత్తులతో ఆయన సన్నిధిలో సామూహికంగా మోకరిల్లి తమ జీవితాలను సన్మార్గంలో నడుపుటకు ప్రార్థిస్తూ పునరంకితం చేసుకోవటం అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలోనే పవిత్ర స్థలమైన 'మక్కాలో' హజ్ జరపటం అని చెప్పవచ్చు.

## బక్రీద్ ప్రాధాన్యత.. బిడ్డను బలి ఇచ్చిన వైనం

బక్రీద్ అంటే మేకను బలి ఇవ్వటం అని చెబుతారు. అయితే ఈ సంఘటన వెనుక సంఘటనలు ఏమిటని పరిశీలిస్తే భగవంతుని ఆజ్ఞ కోసం కన్నబిడ్డలను కూడా నిర్దాక్షిణ్యంగా బలి ఇచ్చే ప్రవక్తలున్నారా? అనే కథనం సాక్ష్యంగా ఉంది. ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం ఖలీలుల్లా భగవంతుని మార్గంలో నడుస్తుండేవారు. అయితే వారి తాత తండ్రులు విగ్రహారాధన చేసేవారు.



కానీ.. ఇబ్రహీం మాత్రం విగ్రహారాధన కూడదనేవారు. భగవంతుడు భావి తరాలకు తమ భక్తుల చరిత్రలను చాటిచెప్పటానికి ఎన్నో పరీక్షలు చేసేవారు.


అలాంటి పరీక్షల్లో ఇబ్రహీం ఖలీలుల్లా కూడా ఒకరై ఇస్లాం చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ఇబ్రహీం ఖలీలుల్లాకు 'దేవుని మిత్రుడనే' పేరు కూడా ఉంది. ఆతన్ని భగవంతుడు పరీక్షించదలచారు. 80 సంవత్సరాల వయస్సు వరకు ఇబ్రహీం ఖలీలుల్లాకు సంతతి లేదు. తరువాత వారి ప్రార్థనలతో రెండవ భార్య హాజీరాకు ఓ మగసంతానం కల్గింది. ఈ బిడ్డకు వారు ఇస్మాయిల్‌జబీ ఉల్లా అని పేరు పెట్టారు.

ఎనభై సంవత్సరాల తరువాత మగసంతానం కలగటంతో ఇబ్రహీం ఖలీలుల్లా వారి భార్యలు సారా సొల్లే అలాహోసొల్లాం, హాజీరాలు ఎంతో ప్రేమానురాగాలతో చూసుకునేవారు. అయితే దేవుడు ఆయన్ను పరీక్షించదలచి దైవదూత జిబ్రాయిల్ ద్వారా ఓ సందేశాన్ని పంపారు. దాని ప్రకారం 80 సంవత్సరాల తరువాత జన్మించిన చిన్నారిని, పురిటిలో ఉన్న భార్య హాజీరాను ఇప్పుడు జమ్ జమ్ బావి ఉన్న చోట నాడు మనుషులే కాదు, కనీసం పక్షులు కూడా సంచరించని ఎడారిలో కనీసం నీటి చుక్క కంటికి కనబడని ప్రాంతంలో వదలి పెట్టారు. భార్య హాజీరా తనను ఎందుకు ఇక్కడ వదలి పెడుతున్నారని ప్రశ్నించగా ఇది దైవాజ్ఞ అని ఇబ్రహీం ఖలీలుల్లా సమాధానం చెప్పటం గమనించదగ్గ విషయం. ఆమెతో పాటు ఇష్కఇజా (చర్మపు సంచి)లో ఖర్జూరపు కాయలు, నీటిని మాత్రమే ఉంచారు. ఎడారిలో ఓ పెద్ద కొండ వెనుక వదలి పెట్టారు.

ఆయన ఇచ్చిన ఖర్జూరపు కాయలు, నీళ్ల పూర్తి కాగా మంచినీటి కోసం ఆమె పరితపించి పడిన అగచాట్లు వర్ణనాతీతం. ఆ చిన్నారి పాలకోసం ఏడుస్తూ నేలమీద కాలు రువ్వగా వచ్చిన నీటి కొలనే నేడు 'జమ్ జమ్' అంటారు. హాజీరా నీటి కోసం ఆహారం కోసం పరితపించిన ప్రాంతాన్నే 'నేడు హాజ్‌కు వెళ్ళే యాత్రికులు' సంచరించే సఫా, మరువా మైదానాలంటారు. ఈ ప్రాంతాల్లో నేడు హాజ్ యాత్రికులు తప్పని సరిగా (ఫర్జ్) సందర్శిస్తారు.

## దేవుని ఆజ్ఞతో బిడ్డను బలి ఇచ్చిన ప్రవక్త

తరువాత ఇస్మాయిల్‌జబీ ఉల్లాకు నాలుగు సంవత్సరాల వయస్సు వచ్చింది. రోజుల బిడ్డగా ఉన్నప్పుడే పరీక్షలను ఎదుర్కొన్న ఆయనకు మరో అగ్నిపరీక్ష ఎదురైంది. తన తండ్రి ఇబ్రాహీం ఖలీలుల్లా ఎంతో ప్రేమగా చూసుకునేవారు. భగవంతుడు మరోసారి తన మిత్రుడు అయిన ఇబ్రాహీం ఖలీలుల్లాకు పరీక్ష పెట్టారు. ఆయన కలలో వరుసగా మూడు రోజులు 'నీకు అత్యంత ప్రీతిపాత్రమైన దానిని త్యజించాలని' వచ్చింది. మొదటి రోజు కలకు పరిహారంగా ఒంటెలను ఖుర్బానీ ఇస్తారు. రెండవ రోజూ అలాగే కల వచ్చింది. 60 సురఖ్ (ఆరోగ్యంగా) ఉన్న ఎరుపు రంగు కల్గిన ఒంటెలను బలిదానం ఇచ్చారు. మూడో రోజు కూడా అలాగే కల వచ్చింది. దాంతో ఖలీలుల్లా ఆలోచనలో పడ్డారు. తనకు ప్రపంచంలో అన్నింటి కన్నా అత్యంత ప్రీతిపాత్రమైనది తన బిడ్డ ఇస్మాయిల్. కాబట్టి దైవాజ్ఞ తన బిడ్డను బలి కోరుతోందని నిర్ణయించుకున్నారు. అయితే కన్నతండ్రి కడుపుతీపి ఆతన్ని కలచి వేస్తున్నా భగవంతుని ఆజ్ఞను పాటించటం తన ధర్మంగా భావించారు. దాంతో తన సతీమణిని ఇస్మాయిల్‌ను తన స్నేహితుని మిలాఖత్ (కలపటానికి) కోసం తీసుకెళుతున్నాను, చక్కగా అలంకరించాలని సూచిస్తారు. భర్త మాటను జవదాటని హాజీరా ఇస్మాయిల్‌ను ముస్తాబు చేసింది.



అయితే 'సైతాన్' హాజీరాను, ఇస్మాయిల్‌ను పలుమార్లు రెచ్చగొడుతూ ఇబ్రహీం భగవంతుని ఆజ్ఞతో బలి ఇవ్వటానికి తీసుకెళుతున్నారని భగ్నపరచుటకు ప్రయత్నించినా ఫలించలేదు. ఆ చిన్నారి ఇస్మాయిల్‌ను సైతాన్ నిన్ను మీ తండ్రి భగవంతుని ఆజ్ఞతో బలి ఇవ్వటానికి తీసుకెళుతున్నారన్నపుడు..

దేవుని ఆజ్ఞను పాటించటం కన్నా తనకు ఏం కావాలని ప్రశ్నించటం గమనించదగ్గ విషయం. ఇబ్రహీం చేతిలో తాడు(రోప్) కత్తి కళ్ళ నుంచి నీరు పెల్లుబుతుండగా గుండె నిండా విషాదంతో మైదానంలోకి తీసుకెళ్ళారు. అయితే తండ్రి తనను బలి ఇచ్చేటప్పుడు ఆయన చేతులు వణుతాయని తాను గిలగిల్లాడే సమయంలో ఓర్చుకోలేరు కాబట్టి "తండ్రీ! నన్ను బలి ఇచ్చేటప్పుడు మీరు కళ్ళకు గంతలు కట్టుకోండి. నా కాళ్ళు చేతులు కట్టిపడేయండి, నన్ను బోర్లా పడుకోబెట్టండి" అని సూచించటం ఆ తండ్రి గుండెల్ని పిండివేసింది. ఆ తండ్రి కొడుకుల త్యాగనిరతి భావితరాలకు మార్గదర్శకంగా మారింది. అయితే బలి ఇచ్చే సమయంలో కత్తి తెగకపోవటం ఇబ్రాహీం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయటం కత్తి నుంచి అశరీర వాణి "ఇబ్రహీం నేను నీ ఆజ్ఞను పాటించాలా? దేవుని ఆజ్ఞను పాటించాలా? అని" ప్రశ్నించటం సత్యసంధతకు నిదర్శనంగా నిలిచింది. దేవుడు తన మిత్రుని దైవాజ్ఞ పాలనను మెచ్చి జిబ్రాయిల్ ద్వారా స్వర్గం నుంచి ఓ దుంబా(మంచి జాతి పొట్టేలు లాంటిది)ను పంపటం కత్తి దాని మెడమీద తెగటం జరిగింది. దీనినే ఖుర్బానీ అంటారు. ఈ సంఘటనకు నిదర్శనంగా నేడు 'బక్రీద్' పండగను జరుపుకుంటున్నారు.

## హాజ్ యాత్ర

దైవప్రవక్త ఇబ్రహీం ఖలీలుల్లా, ఆయన కుమారుడు కలిసి నిర్మించిన నగరమే 'మక్కా'. అక్కడ దైవప్రార్థనకు నిర్ధారించిన స్థలమే కాబా. ప్రపంచంలోని కోట్లాది మంది ముస్లింలు బక్రీద్ సందర్భంగా దర్శించుకునే, నిర్వహించే హాజ్ యాత్ర. గతంలో హాజ్ యాత్రను ఎంతో వ్యయ ప్రయాసలతో నిర్వహించేవారు. కానీ నేడు సునాయాశంగా మారింది. రవాణా సదుపాయాలు పెరిగాయి. మన దేశం నుంచి కూడా హాజ్ యాత్రకు వెళ్ళటానికి ప్రభుత్వాలు పలు వెసులుబాట్లు కల్పిస్తున్నారు. గతంలో భారతదేశం నుంచి వెళ్ళేవారు కేవలం సముద్రయానం చేసేవారు. ఇప్పుడు ఆకాశయానం అభివృద్ధి చెందిన తరువాత గంటల్లోనే అక్కడకు చేరుకుంటున్నారు.

ఈ పండగను ముస్లిం సోదరులు భారతదేశంలో కూడా జరుపుకోనున్నారు. త్యాగాల నిరతికి నిదర్శనంగా జరుపుకునే పండగే బక్రీద్.

# వ్యసనాలకు దూరంగా..

**డా॥ పులివర్తి కృష్ణమూర్తి**

**ప్రతి మనిషికీ కొన్ని అలవాట్లు ఉంటాయి.. కొన్ని చిన్నప్పటి నుండీ వుంటాయి. మరికొన్ని పెద్ద అవుతున్నకొద్దీ అలవడతాయి. అయితే వీటిలో కొన్ని మంచి అలవాట్లు వుంటే, మరికొన్ని చెడు అలవాట్లు వుంటాయి. ఏది మంచీ? ఏది చెడూ అన్నది తెలిసిఏ వయస్సు వుండకపోవచ్చు.**



అవి అలవడిపోతాయి. చెడు అలవాట్లు మనుషులను దెబ్బ తీస్తున్నాయి. కొన్ని అలవాట్లు కాలక్రమేణా వ్యసనాలుగా మారుతున్నాయి. మనిషి వీక్‌నెస్‌గా మారుతున్నాయి. ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. ఒక పదార్థంవైపుగానీ, ఒక విషయంవైపుగానీ మనస్సు లాగేస్తుంది. అది గ్రహించేంతవరకూ ఆగలేం.. మనకు తెలుసు.. అవి హాని చేస్తాయని. కానీ వుండలేకపోవడమే వ్యసనం. మత్తుపానీయాలు పుచ్చుకునేవారు సాయంత్రం కాగానే వారి కాళ్లు బయటకు దారి తీస్తాయి. పుచ్చుకోనంతవరకూ వారికి పిచ్చెక్కుతుంది.


సిగరెట్ తాగేవారూ అంతే. ఈ సిగరెట్టు తాగడం అనేది ఆ మధ్య కాలంలో ఎక్కువగా రచయితల్లో కనిపించేది. ఒక్క పెగ్గు వేసుకోందే కలం కదలదు అనేవారు. పెట్టెలు పెట్టెలు సిగరెట్లు తగలేస్తేగానీ అక్షరంముక్క రాయలేరు కొంతమంది. అప్పటికిగానీ వారికి ట్యూబ్‌లైట్ వెలగదన్నమాట. కళాకారుల్లోనూ, సాహితీవేత్తల్లోనూ అంతటి వ్యసనపరులురేవారు. మొదట ఈ అలవాటు ఒక పెగ్గుతోనో, ఒక సిగరెట్టుతోనో ప్రారంభమవుతుంది. క్రమేణా అది రెండు, మూడు, అలా అలా.. హద్దులు లేకుండా వ్యసనంగా రూపుదిద్దుకుంటుంది. ఈ అలవాట్లు కొన్ని బలవంతంగా రుద్దినవి కూడా కావచ్చు. స్నేహితులు అనబడేవారి నుండి బలవంతంగా సంక్రమిస్తాయి. వద్దన్నా ఊరుకోరు కొందరు, నలుగురిలో కించపర్చి మరీ అలవాటు చేస్తారు. మత్తు పదార్థాలు సేవించేవారి విషయంలో వారి ఆలోచనల్లో మార్పు, వారి కదలికల్లో మార్పూ గమనిస్తూనే ఉన్నాం. ప్రవర్తనలో మార్పు వస్తుంది. తద్వారా బంధువులు దూరమవుతారు. స్నేహితులు తప్పుకుంటారు. అయినా వారు వారి అలవాట్లను మానుకోలేరు. ఆస్తులు అమ్మేసుకున్నవారు, చివరకు భార్యనగలుకూడా అమ్మేసి తాగినవారూ వున్నారు. ఈ వ్యసనం నుండి బయట పడలేక ఆరోగ్యాలు పాడు చేసుకుని ప్రాణాలు కోల్పోయినవారూ వున్నారు.

కొన్ని అధ్యయనాల్లో తేలిందేమిటంటే విద్యార్థి దశలోనే ఎక్కువగా వ్యసనానికి అలవాటు పడుతున్నారట. ముఖ్యంగా తల్లిదండ్రుల నుండి దూరంగా వుండేవారి విషయంలో ఈ దురలవాట్లు అలవడే అవకాశాలు మెండుగా వున్నాయంటారు. కొందరు పిల్లలు మంచివారే వుంటారు. కానీ ఒక్కసారి సిగరెట్ తాగి చూస్తేపోలా! ఎలా వుంటుందో చూద్దాం!! అనుకుంటారు. ఆ ఒక్కసారే కొంపతీస్తుంది. ఈ ప్రయోగాత్మక మనస్తత్వం కాదనలేక వ్యసనపరులుగా మార్చివేస్తుంది. అది చివరికి బలహీనతగా మారి, కొందరు సిగరెట్ తాగితేగాని టాయ్‌లెట్‌కు వెళ్లలేరు. రాత్రి మందు పడితేగానీ నిద్ర పోలేరు. మద్యానికి అలవాడు పడి జీవితాన్ని నాశనం చేసుకున్నవారున్నారు. భార్య దూరమవుతుంది. వారు ఇక ఎందుకూ పనికిరానివారుగా మారతారు. అయితే ఎవరికి వారు గట్టిగా సంకల్పించుకుంటే ఈ వ్యసనాల నుండి బయట పడగలరు. మీరే నిర్ణయించుకోవాలి. మార్పు తప్పకుండా వస్తుంది. మీ జీవితం ఆనందమయం అవుతుంది. ✦

---

## హాస్య కవిత

మా ఆవిడది హడావుడిపేట
మాది కంగారుపేట
మా ఆవిడ పేరు తత్తరబిత్తరం
నా పేరు గాబరగేబర
మా ఆవిడ అందం నందనవనం
నా అందం మాడిపోయిన అన్నం
మా ఆవిడ మనసు బృందావనం
నా మనసు బండరాయితనం
మా ఆవిడ కట్టుకుంటుంది
కంచిపట్టు
లేని చీర
నేను
కట్టుకుంటాను
అంచువున్న
దారములేని రంగుల పంచె
మా ఆవిడ రాగాల పల్లకిలో వెళ్తుంది
నేను రోగాల పల్లకిలో వెళ్తాను
మా ఇద్దరి జీవితం నవ్వుల తరంగం
మా దాంపత్యం
హాస్యానందలహరి.




**- సంపంగివారి జయచంద్రారెడ్డి,**
బాపట్ల

# ఇంట్లో వాస్తు లోపాలున్నాయా?


**వాస్తువార్త**

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458


బి.సౌధామిని – కొడంగల్

ప్రశ్న: ఈ ప్లాను నేను స్వయంగా వేసాను, ఇందులో వాస్తుదోషాలు, మార్పులు వుంటే తెలియచేయగలరు.

జవాబు: మీరు స్వంతంగా వేసుకున్న ప్లాన్ అయినప్పటికీ వాస్తు ప్రకారం చాలావరకు బాగుంది. రోడ్డు వైపు వేసిన దుకాణాలకు, ఇంటికి మధ్య కొంత ఖాళీస్థలం వదిలేస్తే మంచిది. టాయిలెట్స్ ఇంటి మధ్యలో కాకుండా దక్షిణ, పశ్చిమ భాగాల్లో గోడలకు దగ్గరగా వేస్తే సరిపోతుంది.

## అధిక ధనం ఖర్చవుతోంది?

ఎస్.జానకిరామ్ – హైదరాబాద్

ప్రశ్న: మా ఇల్లు దక్షిణ ముఖ సింహద్వారం కలిగి వున్నది. ఉత్తరంలో అసలు స్థలం లేదు. ఇంటిగోడ, ప్రహరీగోడ ఒకటే. రాజవీధి వచ్చింది. దక్షిణంలో చాలా ఖాళీస్థలం ఉన్నది. తూర్పు వైపున ఈశాన్యంలో తక్కువ స్థలం వున్నది. నైరుతి దిశలో కూడా చాలా ఖాళీ వున్నది. ఆగ్నేయం తూర్పు కన్నా కొద్దిగా ఎక్కువగా ఉన్నది. నాకు ఉద్యోగం లేదు. డబ్బు చాలా ఖర్చవుతోంది.

జవాబు: దక్షిణంలో వున్న ఖాళీస్థలం కంటే ఉత్తరాన ఎక్కువ ఖాళీ స్థలం వచ్చేలా యింటి ఉత్తర భాగాన్ని కొంతవరకు పడగొట్టి సవరించాలి. నడక తూర్పు ఈశాన్యం నుండి పశ్చిమ వాయవ్యానికి సింహద్వారాలు అమర్చాలి.



## పనులు అవటం లేదు?

పి.ప్రభాకర్ – గుంటూరు

ప్రశ్న: ఈ ఇల్లు నాకు మా అత్తగారు ఇచ్చారు. ఈ ఇంట్లో వుంటే అనుకున్న పని జరగటం లేదు. చేసిన శ్రమ వృధా అవుతోంది. ఇంట్లో వాస్తులోపం వుందని అనుకుంటున్నాను.

జవాబు: నైరుతిలో వున్న స్నానగది, లెట్రిన్స్‌కి పైన కప్పు లేకపోతే వెంటనే వేయించండి. మీ ఇంట్లో దక్షిణంలో చాలా ఖాళీస్థలం వున్నది. అలా వుండకూడదు. దక్షిణ కాంపౌండు గోడమీద నుండి ఉత్తర వాలుగా షెడ్స్ నిర్మించాలి. స్టెప్‌లాగా పెరిగిన తూర్పు ఆగ్నేయ స్థలాన్ని వదిలేస్తూ తూర్పు కాంపౌండు గోడను సవరించండి. మీకు మంచి ఫలితాలు వస్తాయి. నేల పశ్చిమ పల్లం అయ్యే అవకాశం కనిపిస్తుంది. అలా వుంటే దాన్ని తూర్పు పల్లంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది.

## ఎలాంటి మార్పులు చేయాలి?

వి.భారతి – విజయనగరం

ప్రశ్న: మా ఇంటి ప్లాను చూసి చేయాల్సిన మార్పులు వివరించగలరు.

జవాబు: మీ ఇల్లు వాస్తు ప్రకారం చాలావరకు బాగుంది. మీకు ప్రత్యేక సమస్యలు ఏమైనా వున్నాయేమో తెలుపలేదు. అలాంటి సమస్యలేవీ లేకపోతే మార్పుల గురించి ఆలోచించకండి. ఒకవేళ ప్రత్యేక సమస్యలేమైనా వుంటే అవి ఇంటి పరిసరాల్లో వున్న వాస్తు దోషాల వల్లే అయి వుంటుంది. అప్పుడు వాటినుండి ఇంటిని రక్షించుకోవలసి ఉంటుంది.

## అధిక ధనం ఖర్చవుతోంది?

ఎన్.మహిజ – మాండ్యా

ప్రశ్న: మీకు పంపించిన ప్లాను ప్రకారం వున్న ఇల్లు కొన్నాను. అది నాకు కలిసి వస్తుందా? ఖాళీస్థలంలో ఈశాన్యం వైపు బాత్‌రూమ్, లెట్రిన్ వున్నాయి. వాటిని అక్కడే వుంచాలా? మార్చాలా? బోర్/బావి ఎక్కడ వేయాలి?

జవాబు: ఈశాన్యంలో వున్న లెట్రిన్, బాత్ రూములు తొలగించి ఆ స్థలాన్ని ఓపెన్‌గానే వదిలేయండి. లెట్రిన్, బాత్ రూములను దక్షిణ గోడకు ఆనించి యింటికి తూర్పు గోడకు తగలకుండా నిర్మించండి. తూర్పు మధ్య భాగంలో తలుపుకెదురుగా బోర్‌వెల్ వేయవచ్చు. ఇలా చేస్తే ఇంటికి ఉచ్చస్థానం నడక, తూర్పు ఆగ్నేయ ఈశాన్యాల్లో ఖాళీస్థలం ఏర్పడి మీకు చాలా మంచి ఫలితాలు కలుగుతాయి.

## పనిలో స్థిరత్వం ఉండటం లేదు!

కె.సుబ్రహ్మణ్యం – ఇబ్రహీంపట్నం

ప్రశ్న: నేను అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఈ ఇంట్లోకి మారిన తర్వాత కష్టాలు ఎక్కువయ్యాయి. చేతిలో డబ్బు నిలవడం లేదు. చేసే పనిలో స్థిరత్వం లేదు.

జవాబు: మీరు ఈశాన్య భాగంలో పడుకోవటం మానేసి నైరుతి లేక వాయవ్య మూలలో పడకగది ఏర్పాటు చేసుకోవడం మంచిది. పశ్చిమ వాయవ్యానికి సింహద్వారం ఏర్పాటు చేసుకుంటే చాలా బాగుంటుంది

## ఇంటి ప్లాను ఎలా ఉంది?

సి.కృష్ణమోహన్ – పాల్వంచ

ప్రశ్న: మా ఇంటి ప్లాను పంపిస్తున్నాను. మార్పులు తెలుపగలరు.

జవాబు: మీ ఇంటి స్థల స్వరూపం అరుదైనది. ఉత్తరం ద్వారా వివరణ ఇవ్వడం వీలు కాదు. కలిసి సందేహ నివృత్తి చేసుకోవడం మంచిది.

## షాప్ నాకు కలిసొస్తుందా?

ఎస్.అనూజ్ – జహీరాబాద్

ప్రశ్న: కాంప్లెక్స్‌లో నాలుగు షాప్స్ వున్నాయి. అందులో ఆఖరులో నేను ఉన్నాను. దక్షిణం వైపు రూమ్ ఎదురుగా ట్రాన్స్‌ఫారమ్ వుంది. దీనివల్ల ఏమైనా ఇబ్బంది వుంటుందా?

జవాబు: వ్యవహారాల్లో అనేక అడ్డంకులు ఎదురవుతుంటాయి. ఆ స్థలం మారితే మంచిది.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. యాంత్రికంగా పనులను పూర్తి చేస్తారు. సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది. శుభకార్యాలు, శుభకార్య సంబంధిత ప్రసంగాలు ఫలవంతంగా సాగుతాయి. ప్రయాణాల వల్ల అలసిపోతారు. వారాంతంలో నూతన నిర్ణయాలు తీసుకుంటారు. కచ్చితమైన ప్రణాళికలు రూపొందించుకుంటారు.

## వృషభం



చేపట్టిన పనులు నిదానంగా పూర్తి అవుతాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉన్నా కుటుంబ, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. సహోద్యోగులతో అకారణంగా విరోధాలు ఏర్పడవచ్చు. షేర్లు, భూముల క్రయ-విక్రయాలలో మెలకువలు పాటించండి. వారాంతంలో అనుకూలమైన మార్పులు చోటు చేసుకుంటాయి.

## మిథునం



ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. మిత్రుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి. కొత్త వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. వాహన సౌఖ్యం పొందుతారు. కోర్టుకు సంబంధించిన విషయాలలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. కొత్త వ్యాపారాలు ప్రారంభించడానికి కావలసిన వనరులను సమకూర్చుకుంటారు.

## కర్కాటకం



ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. కోపతాపాలకు దూరంగా ఉండండి. బంధుమిత్రుల నుండి సలహాలు తీసుకుంటారు. మనో నిబ్బరంతో ముందడుగు వేసి ముఖ్యమైన వ్యవహారాలు పూర్తి చేస్తారు. కాలభైరవ రూపును మెడలో ధరించండి. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

## సింహం



కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. జీవిత భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు. ఇతరుల వత్తిడి వల్ల గత్యంతరం లేక మీకు ఇష్టం లేని పనులు చేయాల్సి వస్తుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

## కన్య



మంచి ఫలితాలు సాధించాలంటే మంచి పరిచయాలు కూడా అవసరమని భావిస్తారు. ఆ దిశగా దృష్టి సారిస్తారు. మంచి-చెడులను విశ్లేషించుకొని అడుగులను జాగ్రత్తగా ముందుకు వేస్తారు. ఒక సమస్య తీరితే మరో సమస్యను పరిష్కరించుకోవాల్సి వస్తుంది. ఇలాంటి సంఘటనలు మీ సహనాన్ని పరీక్షిస్తాయి. ఓర్పు వహించండి. జనాకర్షణ పెరుగుతుంది.

## తుల



కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. రచన ప్రాధాన్యంగా కలిగినటువంటి రంగంలోని వారికి నూతన అవకాశాలు లభిస్తాయి. నూతన పరిచయాలు ఏర్పడతాయి. ఈ పరిచయాలు ఉపయుక్తంగా పరిణమిస్తాయి. మంచి-చెడులను విడమరచి చెప్పే సన్నిహిత వర్గం ఉంటారు. వృత్తి, ఉద్యోగాల పరంగా చెప్పుకోదగిన ఒడుదుడుకులేమీ ఏర్పడవు. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు.

## వృశ్చికం



ఆస్తి వివాదాలు పరిష్కారమై లబ్ధి పొందుతారు. జీవితాశయం నెరవేరుతుంది. వృత్తి వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు పదోన్నతులు లభిస్తాయి. ఆర్థిక ప్రయోజనాలు పొందుతారు. కళలు, రాజకీయ, రంగాల లోని వారికి సన్మానయోగం. భూముల క్రయ-విక్రయాలలో లాభాలు పొందుతారు. వివాహాది శుభ కార్యాలు సానుకూల పడతాయి. కీలకమైన విషయాలలో తొందరపాటు తగదు.

## ధనుస్సు



సెంటిమెంట్ వస్తువుల భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. గృహం/వాహన కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సోదరుల నుంచి ధనలాభం పొందుతారు. ఎదుటివారు మీరు చెప్పేది ఆసాంతం వినకుండా మీ మీద నిందలు వేయడం అసహనానికి గురి చేస్తుంది. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

## మకరం



కీలక నిర్ణయాలలో ముఖ్యుల సలహాలు పాటిస్తారు. వివాదాలకు దూరంగా వుండటం మంచిది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా సమయానికి సర్దుబాటు చేసుకుంటారు. బంధువులు, మిత్రులతో విభేదాలు ఏర్పడే అవకాశాలున్నాయి. ఒప్పందాల విషయంలో ఆచి తూచి వ్యవహరించండి. వృత్తి, వ్యాపారాలలో మరింత శ్రద్ధ అవసరం. మీ ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలు అభివృద్ధి చెందుతాయి.

## కుంభం




వ్యక్తిగత విషయాలను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి. బాధ్యతలు పెరగడం వల్ల శ్రమ అధికమవుతుంది. ఇంట్లో, వ్యాపార ప్రదేశంలో అష్టమూలికా గుగ్గిలంతో ధూపం వేయండి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. చిన్న చిన్న వివాదాలు చిలికి చిలికి గాలివానగా మారకుండా జాగ్రత్తలు వహించండి.

## మీనం




కుటుంబ సభ్యుల సమస్యలు పరిష్కారమవుతాయి. మీ శక్తి సామర్థ్యాలు వెలుగులోకి వస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మంచి మార్పులు చోటు చేసుకుంటాయి. షేర్లు, భూముల క్రయ-విక్రయాలలో ఆశించిన లాభాలు అందుతాయి. గృహం, స్థలాలు కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారి సహకారం అందిస్తారు. సాంకేతిక రంగాలలోని వారికి అనుకూలంగా ఉంటుంది.


# ఈ వారం కా'ర్టూన్స్'



సెన్సెక్స్ మామా! ఇప్పుడు మనం బాగా రిచ్చు అట!!
76800

ఏమండీ! ఎలక్షన్స్ అయిపోయాయి.. కౌంటింగ్ కూడా అయిపోయింది.. ఇంకా ఏమి చూస్తున్నారండీ..!!?

సర్వే కంపనీలంటే తమాషాగా ఉందా...? మేము అడిగినప్పుడు ఆ పార్టీకి ఓటేస్తామని చెప్పి..ఇప్పుడు ఈ పార్టీకేసి మా పరువు తీస్తారా ...!?
Post Exit Survey

ఇరాన్‌లోని షిరాజ్ నగరానికి సమీపంలో ఉన్న ఈ ఉప్పునీటి సరస్సును మహర్లూ సరస్సు అంటారు. కాలానుగుణంగా ఇది రంగును మార్చుకుంటుంది. వేసవిలో నీటి మట్టం తగ్గినకొద్దీ నీళ్ల రంగు పింక్ కలర్‌గా మారిపోతుందట. సూక్ష్మజీవుల కారణంగా సరస్సు ఈ విధంగా పింక్ కలర్‌లోకి మారుతుందట.



